## చెట్టుకు కట్టేసి అంగన్‌వాడీ టీచర్‌పై దాడి..ముగ్గురిపై కేసు నమోదు



టీచర్‌ను చెట్టుకు కట్టేసిన దృశ్యం

**కంగ్టి, ఏప్రిల్ 8, ప్రభాతవార్త:** అంగన్‌వాబా టీచర్‌ను చెట్టుకు కట్టేసి కొట్టిన సంఘటనలో ముగ్గురిపై కేసు నమో దైనట్లు ఎస్ఐ దుర్గారెడ్డి తెలిపారు. ఎస్ఐ దుర్గారెడ్డి కథనం ప్రకారం... మండల పరిధిలోని రాసోల్ గ్రామంలో విధులు నిర్వహి స్తున్న వసంతకుమారిని అదేగ్రామానికి చెందిన అవుటి బండెప్ప, చాకలి బాలమణి, కోటగిరి రాములు, భూతాల వైద్యనాథ్, అవుటే సాయవ్వలు టీచర్ వద్దకు వచ్చి నీ భర్త ప్రభాకర్ మా వద్ద హెచ్‌బిఎస్ ఫైనల్స్ పేరుతో డబ్బులు తీసుకుని తమను మోసం చేశాడని ఆరోపిస్తూ అటుగా ఉన్న చెట్టుకు కట్టేసి బూతు మాటలు తిడుతూ భయభ్రాంతులకు గురి చేశారన్నారు. బాధి తురాలు వసంత కుమారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ దుర్గారెడ్డి వివరించారు.



# మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట
# వార్త

## విధుల నుంచి ఎంపిడబ్ల్యూ వర్కర్ తొలగింపు

**నార్సింగి, ఏప్రిల్ 8, ప్రభాతవార్త :** మండల కేంద్రంలో గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఎంపి డబ్ల్యూ వర్కర్‌గా పనిచేస్తున్న వ్యక్తిని విధుల నుంచి తొలగిస్తూ నార్సింగి ఈఓ నాగభూషణం ఉత్తర్వులు జారీ చేశారు. ఉత్తర్వులోని వివరాలు ప్రకారం ప్రజల నుంచి వేణుపై ఆరోపణలు,అభియోగాలు వచ్చాయని, ఇటీవల జరిగిన గ్రామసభలోనూ ప్రజల నుంచి వేణు పై అభ్యంతరాలు రాగా విషయాన్ని సర్వసభ్య సమా వేశంలో పాలకవర్గం దృష్టికి తెచ్చామని, వేణును విధుల నుంచి తొలగించాలని ఏకగ్రీవంగా తీర్మానించడంతో 6 ఏప్రిల్ సోమవారం నుంచి తొలగించారని ఈఓ నాగభూషణం ప్రకటనలో పేర్కొన్నారు.



నార్సింగి గ్రామపంచాయతీ కార్యాలయం



సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

## ప్రభుత్వరంగ సంస్థలు పారదర్శకంగా పనిచేయాలి : ఎమ్మెల్యే

**నారాయణఖేడ్, ఏప్రిల్ 8 ప్రభాతవార్త :** శాసనసభలో బుధవారం జరిగిన పబ్లిక్ అండర్ టేకింగ్ కమిటీ(పీయూసీ) సమావేశంలో తెలంగాణ పబ్లిక్ అండర్ టేకింగ్ మెంబర్, ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి పాల్గొన్నారు. వివిధ ప్రభుత్వరంగ సంస్థల పనితీరు, ఆర్థిక నిర్వహణ, ప్రజా ప్రయోజనాల దృష్ట్యా ఆయా సంస్థలు చేపట్టిన ప్రాజెక్టులపై సమావేశంలో చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రభుత్వరంగ సంస్థలు మరింత పారదర్శకంగా, జవాబుదారీతనంతో పనిచేయాలని సూచించారు. ప్రజల సొమ్ము సద్వినియోగం అయ్యేలా చూడటంతో పాటు, ఆయా సంస్థలు లాభాల బాటలో నడిచేందుకు తీసుకోవాల్సిన చర్యలపై కమిటీ సభ్యులతో కలిసి చర్చించినట్లు తెలిపారు. రాష్ట్ర అభివృద్ధిలో పబ్లిక్ అండర్ టేకింగ్ సంస్థల పాత్ర కీలకమని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వారితోపాటు తెలంగాణ రాష్ట్ర పలు శాఖల అధికారులు సహచర ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.

## మాజీ మంత్రి హరీష్‌రావుకు ఆహ్వాన పత్రిక అందజేత

**గజ్వేల్ టౌన్, ఏప్రిల్ 8 (ప్రభాతవార్త):**



హరీష్‌రావుకు ఆహ్వాన పత్రిక అందజేస్తున్న దృశ్యం

పట్టణంలోని శ్రీసీతారామ ఉమామహేశ్వరాలయం బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రికను బుధవారం ఆలయ కమిటీ నిర్వాహకులు మాజీ మంత్రి సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు, దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డిలకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బ్రహ్మోత్సవాలకు తప్పకుండా హాజరవుతామని తెలిపినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కళ్యాణ్‌కార్ నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలి

### జడ్పీ సిఇవో ఎల్లయ్య



ఇందిరమ్మ ఇళ్లను పరిశీలిస్తున్న జడ్పీ సీఈఓ ఎల్లయ్య

**చిలిపిచెడ్, ఏప్రిల్ 8 ప్రభాతవార్త :** మండల కేంద్రంలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్లను బుధవారం జడ్పీ సీఈఓ ఏల్లయ్య ఎంపీడీఓ ప్రశాంత్, ఎంపీఓ తిరుపతితో కలిసి పరిశీలించారు. స్లాబ్ స్థాయి వరకు పూర్తయిన ఇళ్లను ప్రారంభించడానికి సిద్ధం చేయాలని ఆదేశించారు. పేదల సంక్షేమానికి ప్రభుత్వం అందించిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను వేగవంతం చేసే విధంగా ఇందిరమ్మ కమిటీ సభ్యులు, గ్రామ అధికారులు చర్యలు తీసుకోవాలని జడ్పీ సీఈఓ సూచించారు. నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జడ్పీ సీఈఓ ఏల్లయ్య మాట్లాడుతూ... ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం నిర్మాణాలు చేపట్టాలన్నారు. ఇందుకోసం గ్రామాల్లో అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. త్వరలోనే ఇండ్ల నిర్మాణం పూర్తి చేసుకొని ప్రారంభించాలని తెలియజేశారు.

## గజ్వేల్‌లో పర్యటించిన జాగృతి అధ్యక్షురాలు కవిత

**గజ్వేల్, ఏప్రిల్ 8 (ప్రభాతవార్త):** పట్టణంలో బుధవారం తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత పర్యటించారు. ముందుగా చిన్ననాటి స్నేహితురాలి కుమారుడి వివాహానికి హాజరై అనంతరం తెలంగాణ జాగృతి స్టేట్ సోషల్ మీడియా సభ్యులు సుదర్శన్‌గౌడ్ సతీమణి నందిని ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడగా, వారిని పరామర్శించేందుకు కవిత నేరుగా వారి నివాసానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా నందిని ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ రాష్ట్ర రాజకీయాల్లో చోటుచేసుకోబోతున్న పరిణామాలపై కీలక వ్యాఖ్యలు చేశారు. కేవలం అధికారంకోసం కాకుండా, సామాజిక తెలంగాణ లక్ష్యంగా తమ ప్రయాణం ఉంటుందని స్పష్టం చేశారు. రాష్ట్ర అభివృద్ధిలో ప్రతి ఒక్కరిని భాగస్వామ్యం చేయడమే తమ ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. ఏప్రిల్ 25న జరగబోయే ఈ కీలక ప్రకటన తెలంగాణ రాజకీయాల్లో ఒక కొత్త మలుపు కానుందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక జాగృతి నాయకులు సుదర్శన్‌గౌడ్ కుటుంబసభ్యులు, గైనిబైటి నాగరాజుగౌడ్, బండ మహేందర్‌గౌడ్, ప్యాటా అశోక్, కనకసేన, గజ్వేల్ జాగృతి సభ్యులు పాల్గొన్నారు.



నందిని పిల్లలతో మాట్లాడుతున్న జాగృతి అధ్యక్షురాలు కవిత

# విద్యా ప్రమాణాల పెంపుపై ప్రత్యేక దృష్టి

### మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్

**రామాయంపేట, ఏప్రిల్ 8, ప్రభాతవార్త :** పాఠశాలలో విద్యాప్రమాణాల పెంపుపై ప్రత్యేక దృష్టి సారించాలని, రేషన్ షాపుల నిర్వహణ పారదర్శకంగా నిర్వహించడం జరుగుతుందని మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్ అన్నారు. బుధవారం జిల్లాలోని రామాయంపేట కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని దామరచెరువు గ్రామంలో రేషన్ షాపును జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్ సందర్శించి, ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. ముందుగా కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో అందిస్తోన్న మౌలిక వసతులు, బోధన విధానం, ఉపాధ్యాయుల హాజరు, తదితర అంశాలపై సమగ్రంగా పరిశీలించారు. మధ్యాహ్న భోజన పథకం సక్రమంగా అమలవుతుందో లేదో పర్యవేక్షించారు. మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నారా..? అని అధికారులను అడిగి తెలుసుకున్నారు. అలాగే భోజనశాలను పరిశీలించి, ఆహారం నాణ్యత, వంటశాల పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించారు. ప్రధానంగా గుడ్ల నాణ్యతను పరీక్షించి, వంట సామాగ్రి, సరుకులు, బియ్యం తదితరాలను తనిఖీచేసి, గడువు తేదీలను సరిచూసుకోవాలన్నారు. పాఠశాల పరిసరాలు, తాగునీరు, మరుగుదొడ్లు, మూత్రశాలలు ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచాలన్నారు. అదే విధంగా ప్రతి తరగతి గదిని సందర్శించి, విద్యార్థులకు బోధన చేశారు. ఈనెల 12వ తేదీన పదవ తరగతి సోషల్ ఎగ్జామ్ ఉన్న కారణంగా సోషల్ సబ్జెక్టుపై అక్షాంశాలు, రేఖాంశాలు నిశితంగా విద్యార్థులకు అర్థమయ్యే విధంగా సులభ విధానాల ద్వారా కలెక్టర్ బోధించారు. అలాగే



రామాయంపేటలో విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్న జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్

విద్యార్థులలో పాఠ్యాంశాలపై అవగాహన పెంచే విధంగా ఉపాధ్యాయులు బోధనచేయాలని సూచించారు. ముఖ్యంగా సోషల్ సబ్జెక్టుపై విద్యార్థులు బోర్డు మీద ఉదాహరణలతో బోధించాలన్నారు. విద్యార్థులతో ప్రత్యక్షంగా కలెక్టర్ మాట్లాడి, పాఠ్యాంశాలను చదివించి, అందులోని ప్రశ్నలు అడుగుతూ, వారి బోధన సామర్థ్యాలను పరీక్షించారు. ఈ మేరకు చదువుపై ఆసక్తి పెంచుకునేలా ప్రోత్సహించారు. అంతేకాకుండా పదవ తరగతి విద్యార్థులతో మాట్లాడి, పరీక్షల సమయంలో సరైన ఆహారం తీసుకోవాలని, కంటినిండా నిద్ర పోవాలని, ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు. పట్టుదలతో కష్టపడి చదివి ఉత్తమ మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని ఆకాంక్షించారు. రేషన్ షాపును పరిశీలించి స్టాక్ వివరాలు, లబ్ధిదారులకు మూడునెలల రేషన్ సక్రమంగా అందుతుందా లేదా అనే విషయాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించి కలెక్టర్ సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజాపాలన 99 రోజుల ప్రగతి ప్రణాళికలో భాగంగా క్షేత్రస్థాయిలో పర్యటించడం జరిగిందని తెలిపారు. కస్తూర్బా గాంధీ విద్యాలయం. నిర్వహణ సమర్థవంతంగా ఉందని తెలిపారు రేషన్ కార్డులు కలిగిన లబ్ధిదారులకు సన్న బియ్యం పంపిణీ పారదర్శకంగా జరుగుతుందని ఎటువంటి సమస్యలకు తావులేకుండా పౌరసరఫరాల శాఖ అధికారులు నిత్యం పర్యవేక్షణ చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రజనికుమారి, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయ ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.



బెజుగామలో ఇందిరమ్మ ఇంటిని ప్రారంభిస్తున్న తూంకుంట ఆంక్షరెడ్డి

## ప్రతి పేదకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు

### -కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు తూంకుంట ఆంక్షరెడ్డి

**గజ్వేల్ టౌన్, ఏప్రిల్ 8 (ప్రభాతవార్త):** గజ్వేల్ నియోజకవర్గ పరిధిలో అర్హులైన ప్రతి పేదకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తామని, ఇప్పటికే రెండు విడతలుగా కాంగ్రెస్ ప్రభుత్వం 7 వేల ఇందిరమ్మ ఇళ్లు కేటాయించినట్లు ఆ పార్టీ సిద్దిపేట జిల్లా అధ్యక్షురాలు తూంకుంట ఆంక్షరెడ్డి స్పష్టం చేశారు. బుధవారం గజ్వేల్ మండలం బెజుగామలో సర్పంచ్ నక్కిర్తి గోపాల్, మార్కెట్ కమిటీ చైర్మన్లు నరేందర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, వైస్ చైర్మన్ సర్దార్‌ఖాన్, పిసిసి నాయకులు నాయిని యాదగిరి, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షులు అశోక్ రెడ్డితో కలిసి ఇందిరమ్మ ఇంటిని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ లబ్ధిదారుడు నరహరి ఇందిరమ్మ ఇంటి నిర్మాణం పూర్తిచేసుకొని గృహప్రవేశం చేయడం సంతోషంగా ఉందన్నారు. చారిత్రాత్మక నిర్ణయాలు సిఎం రేవంత్‌రెడ్డి సొంతం కాగా, ఏకకాలంలో రూ.2 లక్షల పంట రుణమాఫీ చేసిన ఘనత ఆయనకే దక్కిందన్నారు. రూ.9వేల కోట్లు రైతు భరోసా నిధులు విడుదల చేయగా ప్రతిపక్షాల నోర్లు మూతపడినట్లు ఎద్దేవ చేశారు. రైతు సంక్షేమానికి పెద్దపీట వేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతి పంట కొనుగోలు చేస్తుండగా, సన్న ధాన్యానికి రూ.500 బోనస్ రైతుల ఖాతాలలో జమ చేసినట్లు గుర్తుచేశారు. గ్రామాల అభివృద్ధిని దృష్టిలో పెట్టుకొని పార్టీలకు అతీతంగా కాంగ్రెస్ ప్రభుత్వం సిసి రోడ్లు, డ్రైనేజీల నిర్మాణానికి రూ.5.41 కోట్లు మంజూరు చేసినట్లు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు సుఖేందర్‌రెడ్డి, సర్పంచ్‌లు వెంకట్‌రెడ్డి, మల్లారెడ్డి, ప్రశాంత్, కాంగ్రెస్ మైనార్టీసెల్ జిల్లా మాజీ అధ్యక్షుడు సమీర్, నేతలు శివారెడ్డి, గుంటుకు శ్రీనివాస్, జంగం రమేష్‌గౌడ్, గాడిపల్లి శ్రీనివాస్, మహమ్మద్ అజ్గర్, నక్క రాములు, జాకీర్, కొండల్‌రెడ్డి, నరేష్‌గౌడ్ పాల్గొన్నారు.

## గుండెపోటుతో మాజీ ఎంపిటిసి మృతి

**బెజ్జంకి, ఏప్రిల్ 8,ప్రభాతవార్త :** మండల పరిధిలోని తోటపల్లి గ్రామానికి చెందిన మాజీ ఎంపిటిసి నల్లగొండ లక్ష్మి గుండెపోటుతో బుధవారం మృతి చెందారు. అందరితో కలిసిమెలసి ఉండే ఆమె మృతి చెందడంతో గ్రామంలో విషాఛాయలు నెలకొన్నాయి. ఆమె మృతిపట్ల నాయకులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఎంపిటిసిగా పని చేసినంత కాలం గ్రామాభివద్ధికి ఎంతో కృషి చేశారని గ్రామస్తులు తెలిపారు.

## నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

**పాపన్నపేట, ఏప్రిల్ 7, ప్రభాతవార్త :**

మండల పరిధిలోని నార్సింగి సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల కారణంగా గురువారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఇ నర్సింలు తెలిపారు. నార్సింగి ఎక్స్‌ప్రెస్ ఫీడర్ వ్యవసాయ కనెక్షన్ ఫీడర్లకు ఉదయం 11 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని వివరించారు. వినియోగ దారులంతా సహకరించాలని కోరారు.

## కొమురవెల్లి రైల్వే స్టేషన్‌ను వెంటనే ప్రారంభించాలి

### సిపిఎం జిల్లా కార్యదర్శి మల్లారెడ్డి

**కొమురవెల్లి, ఏప్రిల్ 8, ప్రభాతవార్త :** మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన రైల్వే స్టేషన్ పనులు పూర్తిచేసి నెలలు గడుస్తున్నా ఎందుకు ప్రారంభించడం లేదని సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి అముదాల మల్లారెడ్డి ప్రశ్నించారు. బుధవారం సిపిఎం పార్టీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో రైల్వే స్టేషన్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనేక పోరాటాల ఫలితంగా కొమురవెల్లిలో రైల్వేస్టేషన్ పనులు ప్రారంభమయ్యాయని పేర్కొన్నారు. పోరాటాల ఫలితంగా ఏర్పాటు చేసిన రైల్వే స్టేషన్ గత జాతరలోనే ప్రారంభిస్తామని చెప్పిన బిజెపి నాయకులు ఆచరణలో అమలు చేయడం లేదన్నారు. మల్లికార్జున స్వామి జాతరకు తెలంగాణ ప్రాంతం నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి భక్తులు వస్తుంటారని తెలిపారు. రైల్వే స్టేషన్ అందుబాటులోకి తీసుకవస్తే ప్రయాణీకులకు, ఇతర ప్రాంతాల నుంచి స్వామి వారి దర్శనానికి వచ్చే భక్తులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు.ఇప్పటికైనా వెంటనే కొమురవెల్లి రైల్వే స్టేషన్‌ను ప్రారంభించి అందుబాటులోకి తేవాలన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు శెట్టిపల్లి సత్తిరెడ్డి, కొంగరి వెంకట్, బండకింద అరణ్‌కుమార్, తాడూరు రవీందర్, తేలు ఇస్తారి, అముదాల రంజిత్‌రెడ్డి, కానుగుల రాజు, తుప్పతి రాజు తదితరులు పాల్గొన్నారు.




మాట్లాడుతున్న సిపిఎం నాయకులు

# గర్భిణీలు ప్రభుత్వాసుపత్రుల్లోనే వైద్యం పొందాలి

### సిద్దిపేట జిల్లా కలెక్టర్ హైమావతి

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:** జిల్లాలోని అన్ని ప్రభుత్వ మాతా-శిశు ఆరోగ్య కేంద్రాల్లో గర్భిణీలకు మెరుగైన వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయని, గర్భిణీలు ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే వైద్యం పొందాలని సిద్దిపేట జిల్లా కలెక్టర్ కె.హైమావతి సూచించారు. బుధవారం ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక-99లో భాగంగా జిల్లా కేంద్రంలోని జిల్లా జనరల్ ఆసుపత్రిలో నిర్వహించిన సేఫ్ మదర్ డే కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ఈనెల 11 వరకు హెల్త్ వీక్‌గా నిర్వహిస్తూ రోజువారీ కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. గర్భధారణ ప్రారంభం నుంచి శిశువు జననం వరకు తల్లి శిశువుల ఆరోగ్యాన్ని కాపాడడమే లక్ష్యమన్నారు. గర్భధారణ నిర్ధారణ అయిన వెంటనే సమీప ఆరోగ్య కేంద్రానికి సమాచారం ఇవ్వాలన్నారు.ప్రభుత్వ ఆసుపత్రుల్లో అన్ని సదుపాయాలు ఉన్నాయని 7, 8, 9వ నెలల్లో పరీక్షలుచేయించుకొని ప్రసవం ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి ధనరాజ్, సైకియాట్రి విభాగం హెచ్‌వోడి డాక్టర్ శాంతి, ఎన్‌సిడీ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ బాబ్జి, డిప్యూటీ డిఎం అండ్ హెచ్ఓ మహేందర్‌రెడ్డి, నర్సింగ్ కళాశాల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.




సేఫ్ మదర్ డే కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ హైమావతి

## ధాన్యం కొనుగోలు కేంద్రాలను పారంభించాలి...

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:** రబీ(యాసంగి) సీజన్ 2025-26 ధాన్యం కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలని సిద్దిపేట జిల్లా కలెక్టర్ కె.హైమావతి అధికారులను ఆదేశించారు.కలెక్టరేట్‌లో బుధవారం నిర్వహించిన జూమ్ సమావేశంలో ఆమె రబీసీజన్ 2025-26 వరి కొనుగోలు ఏర్పాట్లపై ఆర్డీఓలు, సివిల్ సప్లై, మెప్మా, డిఆర్‌డిఏ, తహసీల్దార్లు, డిసిఓ, డిఎఓ, డిఎం మార్కెటింగ్ అధికారులకు దిశానిర్దేశం చేశారు. జిల్లాలో 421 కొనుగోలు కేంద్రాల్లో గన్నిబ్యాగులు, తేమ, తాలు తీసే యంత్రాలు, టార్పాలిన్ షీట్లు, బ్లోయర్లు, తాగునీరు, టెంట్లు, విద్యుత్ కనెక్షన్, వేయింగ్ మిషన్లు తదితర సౌకర్యాలు కల్పించాలని సూచించారు. ప్రతి కేంద్రాన్ని సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధుల సమక్షంలో ప్రారంభించాలన్నారు. మార్కెట్ గోదాముల్లో అందుబాటులోఉన్న ఖాళీ స్థలాన్ని గుర్తించి నిల్వ సదుపాయాలు కల్పించాలని అవసరమైతే కాటన్ మిల్లులను వినియోగించుకోవాలన్నారు. కొనుగోలుచేసిన ధాన్యాన్ని గోదాములకు తరలించేలా ప్రణాళిక రూపొందించి సమస్యలు తలెత్తకుండా చూడాలని సివిల్ సప్లై అధికారులను ఆదేశించారు. సమావేశంలో సివిల్ సప్లై జిల్లా అధికారి జి.తనూజ, డిఎం గోపికృష్ణ పాల్గొన్నారు.

## హత్య కేసులో నిందితుడికి జీవిత ఖైదు

**కంది, ఏప్రిల్ 8, ప్రభాతవార్త:** వరకట్నం కోసం హత్య చేసిన నిందితుడికి జీవిత ఖైదు విధిస్తూ రెండవ అదనపు జిల్లా, సెషన్స్ కోర్టు న్యాయమూర్తి కృష్ణార్జున్ బుధవారం తీర్పు చెప్పినట్లు ఇంద్రకరణ ఎస్ఐ విజయ్‌కుమార్ తెలిపారు. ఎస్ఐ కథనం ప్రకారం... 2016లో ఇంద్రకరణ్ గ్రామానికి చెందిన కుమ్మరి ప్రభు భార్యను అదనపు కట్నం కోసం వేదింపులకు గురిచేసి హత్యచేసిన సంఘటనలో పోలీసులు 304(బి), 302 ఐపిసి సెక్షన్‌ల కింద కేసు నమోదు చేశారు. ఏ1 ముద్దాయి కుమ్మరి ప్రభు(28) నేరం రుజువు కావడంతో జీవిత ఖైదుతోపాటు జరిమాన విధించారు.అయితే జరిమాన చెల్లించకుంటే మరో మూడు నెలలు సాధారణ జైలుశిక్షను అనుభవించాలని తీర్పు చెప్పారు. ఏ2గా ఉన్న ప్రభు తండ్రి నర్సింహులు కేసు విచారణలో ఉండగానే కానరాని లోకాలకు చేరిపోవడంతో నర్సింలుపై కేసును కొట్టేయడం, ఏ3గా ఉన్న తల్లి మాణెమ్మపై సరైన సాక్షాధారాలు లేనందున నిర్దోశిగా విడుదల చేశారు.

## రెండు కిరాణా దుకాణాల్లో చోరీ..నగదు అపహరణ

**కంది, ఏప్రిల్ 8, ప్రభాతవార్త:** మండల పరిధిలోని చర్లగూడెం గ్రామంలోని శ్రీసిద్దివినాయక, కృష్ణగౌడ్ కిరాణా దుకాణాలలో మంగళవారం రాత్రి చోరి జరిగింది. ఇంద్రకరణ్ ఎస్ఐ విజయ్‌కుమార్ కథనం ప్రకారం... ఈనెల 7వ తేదీన ఫిర్యాధి కుమారుడు రాత్రి 8 గంటలకు దుకాణం కట్టేసి ఇంటికి వెళ్లిపోయాడన్నారు. 8న ఉదయం 6 గంటలకు దుకాణం తీసేందుకు రాగా దుకాణం తాళం పగలకొట్టి ఉండటం, తలుపులు తెరిచి ఉండటం చూసి లోపలికి వెళ్లి చూడగా రూ. 50 వేల నగదు అపహరణకు గురైనట్లు గుర్తించాడు. సిద్దివినాయక కిరాణ దుకాణానికి అటుగా ఉన్న కృష్ణగౌడ్ కిరాణా దుకాణంలోనూ గుర్తు తెలియని దుండగులు దుకాణం తాళం పగలకొట్టి రూ. 8 వేలు దొంగలించుకుపోయారన్నారు. అటుగా ఉన్న లింగాయ్య గూడెం అంజయ్య ఇంటి తలుపులు పగలకొట్టినా దొంగతనంకు పాల్పడలేదన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## 45 ట్రాక్టర్ల ఇసుక సీజ్



ఇసుక సీజ్ చేస్తున్న అధికారులు

**కొల్చారం, ఏప్రిల్ 8 (ప్రభాతవార్త):** ఇసుక అక్రమంగా నిల్వ చేస్తే కఠిన చర్యలు తప్పవని తహసీల్దార్ శ్రీనివాస్‌చారి, ఎస్ఐ అహ్మద్ మోహిద్దీన్ హెచ్చరించారు. బుధవారం మండలపరిధిలోని కిష్టాపూర్ గ్రామంలో అక్రమంగా నిల్వచేసిన 45 ట్రాక్టర్ల ఇసుకను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఈ చర్యలో ఎస్ఐ అహ్మద్ మోహిద్దీన్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ శ్రీవిద్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, స్వాధీనం చేసుకున్న ఇసుకను ఈనెల 10వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు కిష్టాపూర్ గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద బహిరంగ వేలం నిర్వహిస్తామని తెలిపారు. వేలంలో పాల్గొనదలచినవారు రూ.1,12,500లను డిమాండ్ డ్రాఫ్ట్ (డీడీ) రూపంలో చెల్లించి పాల్గొనాలని సూచించారు. ఇసుక అక్రమ రవాణా, నిల్వలపై నిఘా ఉంచి చర్యలు తీసుకుంటామని అధికారులు స్పష్టం చేశారు.

## విద్యుదాఘాతంతో యువకుడి మృతి

**నర్సాపూర్, ఏప్రిల్ 8, ప్రభాతవార్త :** విద్యుదాఘాతంతో ఒక యువకుడు మృతి చెందిన సంఘటన నర్సాపూర్ మండలం ఆవంచ గ్రామంలో బుధవారం చోటు చేసుకుంది. ఎస్ఐ రంజిత్‌కుమార్‌రెడ్డి కథనం ప్రకారం...ఆవంచ గ్రామానికి చెందిన జగ్గంపేట సుధాకర్(29) ఒక ప్రైవేట్ కంపెనీలో పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. ఈ క్రమంలో బుధవారం ఉదయం ఇంటి వద్ద సంపులో నుండి నీరు తోడే ప్రయత్నంలో మోటర్ వైర్ తేలి ఉండడంతో ప్రమాదవశాత్తున షాక్ తగిలి సుధాకర్ స్పృహకోల్పోయి పడిపోయాడని తెలిపారు. ఇంట్లో వంట చేస్తున్న మృతుడి భార్య కల్పన చూసి అరవగా బంధువులు, ఇరుగుపొరుగువారు వచ్చి చూసి వెంటనే నర్సాపూర్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో డాక్టర్లు పరీక్షించి అప్పటికే సుధాకర్ మృతి చెందాడని తెలిపారు. మృతుడి భార్య కల్పన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రంజిత్ కుమార్‌రెడ్డి తెలిపారు. మృతుడికి భార్య కల్పన, ఇద్దరు ఆడపిల్లలు దనుశ్రీ 3 సంవత్సరాలు, ఆదిశ్రీ 18 నెలలు ఉన్నారు. సుధాకర్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

## కారు ఢీకొని యువకుడు దుర్మరణం

**సదాశివపేట, ఏప్రిల్ 7 (ప్రభాతవార్త):** సదాశివపేట పోలీసు స్టేషన్ పరిధిలోని నిజాంపూర్ క్రాస్ రోడ్డు వద్ద తన బైక్‌తో రోడ్డు దాటుతున్న వ్యక్తిని కారు ఢీకొనడంతో యువకుడి అక్కడిక్కడే మృతి చెందాడు.సదాశివపేట పట్టణంలోని గురునగర్ కాలనికి చెందిన క్రిష్ణ(24) కూలి పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు.సోమవారం రాత్రి 11 గంటల ప్రాంతంలో నిజాంపూర్ రోడ్డు నుంచి సదాశివపేట వైపుకు తన బైకుతో జాతీయ రహాదారి దాటుతుండగా హైదరాబాదు నుంచి జహిరాబాదు వైపుకు వెళ్తున్న కారు అతి వేగంగా వస్తూ క్రిష్ణ బైక్‌ను ఢీకొట్టడంతో క్రిష్ణ తలకుచ బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు.మృతుడి బావ లక్ష్మన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

## తండ్రి చెంతకు తప్పిపోయిన బాలుడు

**జగదేవ్‌పూర్, ఏప్రిల్ 8 (ప్రభాతవార్త):** మండల పరిధిలోని అలిరాజపేట గ్రామ సమీపంలో గల హోలీక్రాస్ కాలేజీ వద్ద ఓ బాలుడు తప్పిపోయి ఒంటరిగా ఉండగా బాలున్ని గమనించిన పోలీసులు జగదేవ్‌పూర్ పోలీస్‌స్టేషన్‌కు తీసుకువచ్చారు. అనంతరం బాలున్ని విచారించగా తన పేరు జీవన్ తండ్రి పేరు నవీన్ అని, మేస్త్రీ పని చేస్తాడని, తమ ఊరు ఒంగోలు అని తెలుపగా అట్టి వివరాలను సోషల్ మీడియాలో వాట్సాప్ ద్వారా ప్రచారం చేయగా, సుమారు గంటలోపే సమాచారం బాలుని తండ్రి నవీన్‌కు తెలియడంతో వెంటనే జగదేవ్‌పూర్ పోలీస్‌స్టేషన్‌కు రాగా పోలీసులు బాలున్ని తండ్రి నవీన్‌కు అప్పగించారు. ఈ సందర్భంగా బాలుని తండ్రి నవీన్ జగదేవ్‌పూర్ పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది సయ్యద్ ఖాజా తదితరులు ఉన్నారు.




బాలున్ని తండ్రికి అప్పజెప్పున్న పోలీసులు

## 8,9,10 తరగతులకు అనుమతించాలని వినతి



రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ డాక్టర్ ఈ. నవీన్ నికోలస్‌ను కలిసి వినతి పత్రం అందజేస్తున్న పాఠశాల అభివృద్ధి కమిటీ సభ్యులు

**సికింద్రాబాద్, ఏప్రిల్ 8 ప్రభాతవార్త:** సికింద్రాబాద్ మండలంలోని భోలక్‌పూర్‌లో ఉన్న మేకలమండి ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో 8, 9, 10వ తరగతికి అనుమతి మంజూరు చేయాలని కోరుతూ పాఠశాల అభివృద్ధి కమిటీ సభ్యులు తెలంగాణ రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ డాక్టర్ ఈ. నవీన్ నికోలస్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు.ప్రస్తుతం పాఠశాలలో 700 మంది విద్యార్థుల చదువుతున్నారని, నూతన భవనం నిర్మాణం పూర్తి అయ్యిందని, సరిపడే తరగతి గదులు అందుబాటులో ఉన్నాయని, పాఠశాల అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు, సీనియర్ జర్నలిస్టు ఈ. చంద్రశేఖర్ ఆయనకు వివరించారు. సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ ఇచ్చిన సిఫారసు లేఖను ఆయనకు అందజేశారు. ఇందుకు స్పందించిన డాక్టర్ నవీన్ నికోలస్ మాట్లాడుతూ తప్పకుండా 8,9,10 తరగతుల నిర్వహణకు అనుమతి మంజూరు చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు జి. స్వరూప, పాఠశాల అభివృద్ధి కమిటీ ప్రధాన కార్యదర్శి బి. నర్సింగ్ రావు, సభ్యులు కే. మల్లికార్జున రెడ్డి, పి.గోపికృష్ణ, డి.భరత్ భూషణ్‌లు పాల్గొన్నారు.

## 'మెగా' అభిమానం.. బాపట్ల నుంచి సైకిల్‌పై ప్రయాణం



మెగా సైకిల్ యాత్ర చేపట్టిన నటరాజ్ శ్రీనివాస్(కాషాయ దుస్తుల్లో ఉన్న వ్యక్తి)

**జూబ్లీహిల్స్, ఏప్రిల్ 8, ప్రభాతవార్తః**

'మెగా' కుటుంబంపై అభిమానంతో ఒక అభిమాని బాపట్ల నుంచి హైదరాబాద్‌కు సైకిల్‌పై ప్రయాణించారు. ఆంధ్రప్రదేశ్‌లోని బాపట్ల జిల్లా పర్చూరు గ్రామానికి చెందిన నటరాజ్ శ్రీనివాస్‌కు మెగాస్టార్ చిరంజీవి, రాంచరణ్ అంటే అమితమైన ఇష్టం. చిరంజీవి డ్యాన్స్‌ను స్ఫూర్తిగా తీసుకొని అతను డ్యాన్స్ మాస్టర్‌గా ఎదిగాడు. ఈ నేపథ్యంలోనే చిరంజీవిని, రాంచరణ్‌ను కలవాలని ఆయన సైకిల్‌పై 'మెగా సైకిల్ యాత్ర' పేరుతో యాత్రను ప్రారంభించారు. పర్చూరులోని ఆంజనేయ స్వామి దేవాలయం వద్ద సైకిల్ యాత్ర ప్రారంభించి నేరుగా కొండగట్టు అంజన్న వద్దకు చేరుకున్నారు. అక్కడ తన మొక్కులు తీర్చుకొని హైదరాబాద్‌లోని చిరంజీవిని కలవడానికి వచ్చారు. చిరంజీవి అందుబాటులో లేకపోవడంతో విషయం తెలుసుకున్న అఖిల భారత చిరంజీవి యువత అధ్యక్షుడు స్వామినాయుడు ఆయనను చిరంజీవి బ్లడ్ బ్యాంకుకు ఆహ్వానించారు. అక్కడ చిరంజీవి సోదరి డాక్టర్ మాధవి ఆయనను ఘనంగా సత్కరించారు. ఆయన అభిమానాన్ని కొనియాడారు.

## విద్యానగర్ రామాలయం వద్ద డ్రైనేజీ సమస్య పరిష్కారం



విద్యానగర్ రామాలయం సమీపంలో డ్రైనేజీ మరమ్మతు పనులను చేపట్టిన దృశ్యం

**చిక్కడపల్లి ఏప్రిల్ 8 ( ప్రభాతవార్త ) :**

విద్యానగర్ రామాలయం సమీపంలో గత కొన్ని రోజులుగా పొంగి పొర్లుతున్న డ్రైనేజీ సమస్యకు ఎట్టకేలకు పరిష్కారం లభించింది. డ్రైనేజీ నీరు వీధుల్లోకి చేరడంతో స్థానిక ప్రజలు, భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్న విషయాన్ని గమనించిన బీజేపీ డివిజన్ అధ్యక్షులు పాశం సాయికృష్ణ యాదవ్ వెంటనే స్పందించారు. స్థానికుల విజ్ఞప్తి మేరకు బుధవారం జలమండలి ఉన్నతాధికారులతో ఫోన్లో మాట్లాడి సమస్య తీవ్రతను వివరించారు. ఆయన విజ్ఞప్తితో స్పందించిన అధికారులు వెంటనే సిబ్బందిని పంపి పూడికతీత పనులు చేపట్టి సమస్యను చక్కదిద్దారు. తమ సమస్యను త్వరితగతిన పరిష్కరించినందుకు కాలనీ వాసులు సాయికృష్ణ యాదవ్ కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు జగదీష్, సంగం బాలరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## అంబేద్కర్ నగర్ బస్తీలో అక్రమ నల్లా కనెక్షన్లు గుర్తింపు



జలమండలి అధికారులతో కలిసి పర్యటిస్తున్న మామిడి నర్సింగ్‌రావు

**జూబ్లీహిల్స్, ఏప్రిల్ 8, ప్రభాతవార్తః**

ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ ఆదేశాల మేరకు ఫిల్మ్‌నగర్‌లోని పద్మాలయ అంబేద్కర్ నగర్ బస్తీని జలమండలి అధికారులతో కలిసి ఫిల్మ్‌నగర్ 18 బస్తీల సంక్షేమ సంఘం అధ్యక్షుడు మామిడి నర్సింగ్‌రావు సందర్శించారు. బస్తీలో డ్రైనేజీ, నీటి సమస్యలతో తాము ఇబ్బందులు పడుతున్నట్లు బస్తీవాసులు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. జలమండలి మేనేజర్ అభిషేక్, ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, లైన్‌మెన్ ఖలీల్‌తో కలిసి బస్తీలో పర్యటించారు. ఈ సందర్భంగా బస్తీలో అక్రమ నల్లా కనెక్షన్లు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. కొందరు మోటర్లు పెట్టడం వల్ల నీటి సమస్య తలెత్తుతుందని గుర్తించారు. వేసవి నేపథ్యంలో సమస్య మరింత తీవ్రమవ్వకముందే అక్రమ కనెక్షన్లను తొలగిస్తామని అధికారులు తెలిపారు. ఇదిలా ఉండగా ఆన్‌లైన్‌లో ట్యాంకర్ బుక్ చేసుకుంటే రోడ్డు బాగోలేదని ట్యాంకర్ రద్దు చేస్తున్నారని, అదే ట్యాంకర్‌కు రూ. 2వేలు చెల్లిస్తే కమర్షియల్‌గా వస్తుందని బస్తీ వాసులు జలమండలి అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. ఇప్పటికే బస్తీలో నెలకొన్న సమస్యలపై ఎమ్మెల్యే ఆధ్వర్యంలో త్వరలో అభి వృద్ధి పనులు చేపడుతామని మామిడి నర్సింగ్‌రావు తెలిపారు. కార్యక్రమంలో బస్తీ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, బస్తీ వాసులు పాల్గొన్నారు.

### సేవాలాల్ మహారాజ్ జయంతిని కేంద్రం అధికారికంగా నిర్వహించాలి

**సైఫాబాద్, ఏప్రిల్ 8 ప్రభాతవార్త:** రాష్ట్రంలోని లక్షలాది మంది బంజారాల సమస్యలను పరిష్కారించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక విధానాన్ని రూపొందించాలని తెలంగాణ రాష్ట్రీయ గోర్ సేనా డిమాండ్ చేసింది. నిరుపేదలు వలస వెళ్ళే బంజారాల కుటుంబాల కోసం దేశవ్యాప్తంగా కేంద్ర నివాస పాఠశాలలను ఏర్పాటు చేయాలని సేనా నాయకులు కోరారు. ఈ మేరకు బుధవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో గోర్ సేనా అధ్యక్షుడు ధనావత్ రాందాస్, ఉపాధ్యక్షుడు రాజునాయక్ మాట్లాడుతూ బంజారాల ఆధ్యాత్మిక గురువైన సద్గురు సేవాలాల్ మహారాజ్ జయంతిని కేంద్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని, కర్ణాటక రాష్ట్ర తండా అభివృద్ధి సంస్థ తరహాలో కేంద్ర తండా అభివృద్ధి సంస్థను ఏర్పాటు చేసి నిధులను కేటాయించాలని కోరారు. బంజారాల మాతృభాష గోర్‌బోలిని భారత రాజ్యాంగంలో 8వ షెడ్యూల్డ్‌లో చేర్చి అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు.

## నైతిక విలువలు గోప్యత విషయంలో కఠినమైన చట్టాల ఆవశ్యకత ఉంది



కార్యక్రమంలో పాల్గొన్న అంతర్జాతీయ నిపుణులు గోర్గ్ మోల్ట్ , ప్రొఫెసర్ లింబాద్రి తదితరులు

**చిక్కడపల్లి ఏప్రిల్ 8 ప్రభాతవార్త :** సాంకేతికత విప్లవాత్మకంగా మారుతున్న ప్రస్తుత తరుణంలో, ఆర్టిఫిషల్ ఇంటెలిజెన్స్ అందించే అవకాశాలను అందిపుచ్చుకుంటూనే.. దానివల్ల కలిగే చట్టపరమైన సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కోవాలని బిట్‌కాయిన్ సహవ్యవస్థాపకుడు, జర్మనీలోని సతోషి స్కూల్ సీఈఓ గోర్గ్ మోల్ట్ పేర్కొన్నారు. బుధవారం బాగ్ లింగంపల్లి డాక్టర్ బి. ఆర్. అంబేద్కర్ లా కాలేజీ ఆధ్వర్యంలో ఆర్టిఫిషల్ ఇంటెలిజెన్స్ యుగంలో చట్టం అనే అంశంపై నిర్వహించిన అంతర్జాతీయ సదస్సులో ఆయన ముఖ్య వక్తగా ప్రసంగించారు. డిజిటల్ కరెన్సీ , ఏఐ కలయిక భవిష్యత్తులో ఆర్థిక, న్యాయ వ్యవస్థలను ప్రభావితం చేస్తుందని, ఈ మార్పులకు అనుగుణంగా న్యాయ విద్యార్థులు సిద్ధంగా ఉండాలని సూచించారు. ఏఐ నిపుణురాలు ఏంజెలికా మాట్లాడుతూ కృత్రిమ మేధస్సు ద్వారా న్యాయపరమైన పరిశోధనలు వేగవంతం అవుతాయని, అయితే నైతిక విలువలు, గోప్యత విషయంలో కఠినమైన చట్టాల ఆవశ్యకత ఉందని వివరించారు. అంబేద్కర్ విద్యాసంస్థల సీఈఓ ప్రొఫెసర్ లింబాద్రి , కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి. సృజన తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏఐ చట్టంపై రూపొందించిన ప్రత్యేక పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సదస్సులో వివిధ కళాశాలల విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొని ఏఐ సవాళ్లపై వక్తలతో ముఖాముఖి చర్చించారు. పాల్గొన్న వారందరికీ ఈ కార్యక్రమం విజ్ఞానదాయకంగా నిలిచిందని విద్యావేత్తలు ప్రశంసించారు.

## బిసి కాంట్రాక్టర్లకు ఇచ్చిన హామీని తక్షణమే అమలు చేయాలి



ధర్నాలో మాట్లాడుతున్న తెలంగాణ బీసీ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ నేతలు

**ధర్నాచౌక్, ఏప్రిల్ 8, ప్రభాతవార్త:** ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ, బీసీ కాంట్రాక్టర్లకు 42శాతం కాంట్రాక్టులు ఇస్తామని ఇచ్చిన హామీని తక్షణమే అమలు చేయాలని బీసీ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు సుంకరి సత్తయ్యగౌడ్, ఎస్.భాస్కరరావులు డిమాండ్ చేశారు. బుధవారం ఇందిరాపార్కు ధర్నా చౌక్‌లో బీసీ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకు తెలంగాణ రాజ్యాధికార పార్టీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న హాజరై మద్దతుగా మాట్లాడుతూ, బీసీ కాంట్రాక్టర్లు చేస్తున్న న్యాయపోరాటానికి తెలంగాణ రాజకీయ పార్టీ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. బీసీలకు ఇచ్చిన హామీలు అమలుచేసే వకరకు పోరాడుతూనే ఉంటామని, ప్రభుత్వాన్ని నిలదీస్తూనే ఉంటామని స్పష్టం చేశారు. 42శాతం హామీ ఇచ్చిన ప్రభుత్వం, బీసీ కాంట్రాక్టర్లను మోసం చేసిందని, బీసీ హక్కులు దోచుకునే పాలనను ఇక సహించబోమని అన్నారు. బీసీ కాంట్రాక్టర్ల బిల్లులు తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ ధర్నా కార్యక్రమంలో బీసీ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ నేతలు జి. సాయికిరణ్, పట్నం శ్రీశైలం, జి.భాస్కర్, ఆర్.హనుమంతుసాగర్, సంపంగి రమేష్, కాస జంగయ్య మరియు తెలంగాణ రాజ్యాధికార నాయకులు, పార్టీ అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించాలి



సమావేశంలో పాల్గొన్న లంగాణ యునైటెడ్ క్రిస్టియన్ పాస్టర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి గోనె సల్మాన్ రాజ్, క్రిస్టియన్ సంఘాల ప్రముఖులు

**చిక్కడపల్లి ఏప్రిల్ 8 ( ప్రభాతవార్త ) :** దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించాలనే ప్రధాన డిమాండ్‌తో తెలంగాణలోని అన్ని క్రైస్తవ విభాగాల నాయకులు ఏకతాటిపైకి వచ్చారు. బుధవారం నగరంలో తెలంగాణ యునైటెడ్ క్రిస్టియన్ పాస్టర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి గోనె సల్మాన్ రాజ్ అధ్యక్షతన జరిగిన సభలో రాష్ట్రవ్యాప్త భారీ ఉద్యమాన్ని చేపట్టనున్నట్లు ప్రతినిధులు ప్రకటించారు. చారిత్రాత్మక సమావేశంలో బాప్టిస్ట్, సి.ఎస్.ఐ, వెస్లీ, మెథడిస్ట్, లూథరన్ వంటి ప్రధాన చర్చిలతో పాటు తెలంగాణ బిషప్ కౌన్సిల్, కల్వరి టెంపుల్, మన్నా మినిస్ట్రీస్, బిలీవర్స్ ఈస్టర్న్ చర్చి ప్రతినిధులు పాల్గొన్నారు. రాజ్యాంగబద్ధమైన గుర్తింపు, సామాజిక న్యాయం కోసం నిర్ణయాత్మక పోరాటం చేయాలని వారు ఏకగ్రీవంగా తీర్మానించారు. భారత రాష్ట్రపతి, ప్రధాన మంత్రి, కేంద్ర హోం మంత్రి, లోకసభ, రాజ్యసభ ప్రతిపక్ష నాయకులకు వినతి పత్రాలు సమర్పించి, పార్లమెంటులో ప్రత్యేక బిల్లు ప్రవేశపెట్టాలని డిమాండ్ చేయనున్నారు. అంతేకాకుండా ఆంధ్రప్రదేశ్ తరహాలోనే తెలంగాణ అసెంబ్లీలో కూడా ఎస్సీ హోదాకు మద్దతుగా తీర్మానం చేయాలని ముఖ్యమంత్రిని కోరనున్నారు. ఏప్రిల్ 20 లోపు మండల కేంద్రాల్లో తహసీల్దార్లకు, ఏప్రిల్ 25 లోపు స్థానిక ఎంపీలకు వినతి పత్రాలు అందజేయనున్నారు. ఏప్రిల్ 14న రాజకీయ పార్టీలతో సదస్సు, ఏప్రిల్ 18న న్యాయ నిపుణులతో లీగల్ కన్సల్టేషన్ నిర్వహించనున్నారు. మే నెలలో హైదరాబాద్‌లో భారీ స్థాయిలో "దళిత క్రైస్తవ ఎస్సీ హోదా గర్జన" ర్యాలీతో ఉద్యమాన్ని ఉధృతం చేయనున్నారు. ఈ కార్యక్రమంలో బ్రదర్ జోస్ డేనియల్, బిషప్ తిమోతి, బెనోని రిచర్డ్, ప్రేమ్ సాగర్, పాల్, హేమలత, షాలిని తదితరులు పాల్గొని, దళిత క్రైస్తవుల హక్కుల సాధనకై అందరూ కలిసికట్టుగా పోరాడాలని పిలుపునిచ్చారు.

## ఆర్టిసన్ ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం నెరవేర్చాలి : ఆర్టిసన్ ఉద్యోగులు



ఇబ్రహీంబాగ్ డివిజన్ వద్ద ఆందోళన చేస్తున్న విద్యుత్ ఆర్టిసన్ ఉద్యోగుల దృశ్యం

**నార్సింగి, ఏప్రిల్ 8 ప్రభాతవార్త :** ఆర్టిసన్ ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ బుధవారం ఇబ్రహీంబాగ్ డివిజన్ కార్యాలయంలో పని చేసే ఉద్యోగులంతా విధులను బహిష్కరించి ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ యాక్షన్ కమిటీ ప్రతినిధులు సతీష్, పవన్, బ్రయ్, సతీష్‌లు మాట్లాడుతూ యాజమాన్యం మా పట్ల వివక్షను చూపడం మానుకోవాలని డిమాండ్ చేశారు. సమాన పనికి సమాన వేతనాలు ఇవ్వాలని, రెగ్యులర్ ఉద్యోగులతో సమానంగా బాధ్యతలు నిర్వహిస్తున్న మాకు వేతనాల్లో ఉన్న వ్యత్యాసంను తొలగించాలని, విద్యార్హతను బట్టి కేడర్ కన్వర్షన్ కల్పించాలని, ఉమ్మడి రాష్ట్రంలోని సర్వీసు రూల్స్ మాకు వర్తింపచేయాలని, 2016. డిసెంబర్ కంటే ముందు నుంచి పని చేస్తూ, నేటికీ అవుట్ సోర్సింగ్ ఉద్యోగులుగా ఉన్న వారిని ఆర్టిసన్‌లుగా గుర్తించాలని, పీస్‌రేట్ కార్మికులకు జీవో 11. ప్రకారం కనీస వేతనాలు చెల్లించాలని, 2026.వేతన సవరణను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఒకే వ్యవస్థలో పని చేస్తున్న వారికి రెండు రకాల విధానాలు ఎందుకు అని ప్రశ్నించారు. 2016.కటాఫ్ తేదీ వలన ఎంతోమంది కార్మికులు నష్టపోయారని, వారిని వెంటనే ఆర్టిసన్లుగా గుర్తించి న్యాయం చేయాలని పేర్కొన్నారు. నేడు రాష్ట్ర వ్యాప్తంగా విద్యుత్ వినియోగదారులకు అందుతున్న నాణ్యమైన సరఫరా వెనుకాల ఆర్టిసన్ ఉద్యోగుల రక్తం ఉందన్నారు. ప్రాణాలకు తెగించి పని చేస్తున్నా మమ్మల్ని ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం తగదన్నారు. మా న్యాయమైన డిమాండ్లు నెరవేరే వరకు ఉద్యమాన్ని ఆపేది లేదని హెచ్చరించారు.

### సాలార్‌జంగ్ మ్యూజియంలో రెండు ప్రత్యేక ఎగ్జిబిషన్లు

### -మే నెలలో మ్యూజియంలో సమ్మర్ ఆర్ట్ క్యాంప్

**చార్మినార్,ఏప్రిల్ 8 ప్రభాతవార్త :** సాలార్‌జంగ్ మ్యూజియంలో ఈ నెల 14వ తేదీన రుమాలే ప్రత్యేక ఫోటో ప్రదర్శనను ఏర్పాటు చేయనున్నామని మ్యూజియం కీపర్ డాక్టర్.నాయక్ తెలిపారు.కర్ణాటకకు చెందిన ప్రముఖ చిత్రాకారులు రూమాలే వేసిన అరుదైన చిత్రాలు ఫోటో ప్రదర్శనలో నెల కొల్పనున్నామని ఆయన తెలియజేశారు.తెలంగాణ రాష్ట్ర గవర్నర్,సాలార్‌జంగ్ మ్యూజియం బోర్డు చైర్మన్ శివ్ ప్రతాప్ శుక్లా 14వ తేదీన ఉదయం11 గంటలకు రుమాలే ప్రత్యేక ఫోటో ప్రదర్శనను ప్రారంభిస్తారని ఆయన తెలిపారు.కాగా భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్.బి.ఆర్.అంబేద్కర్ జయంతి సందర్భంగా ఏప్రిల్ నెల 13వ తేదీన సాలార్‌జంగ్ మ్యూజియంలో ప్రత్యేక ఫోటో ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేస్తున్నామని,ఈ ప్రత్యేక ఫోటో ఎగ్జిబిషన్‌లో డాక్టర్.బి.ఆర్.అంబేద్కర్ జీవితానికి సంబంధించిన దాదాపు యాభై చిత్రాలు ఉన్నాయని ఆయన తెలియజేశారు.మే నెలలో పాఠశాలల విద్యార్థుల కోసం సాలార్‌జంగ్ మ్యూజియంలో సమ్మర్ ఆర్ట్ క్యాంప్‌ను నిర్వహించనున్నామని ఆయన తెలిపారు.

### అయ్యప్ప స్వామి దేవాలయంలో రవిశేఖర్‌రెడ్డి పూజలు



అయ్యప్ప స్వామి దేవాలయంలో పూజలు నిర్వహించిన రవిశేఖర్‌రెడ్డి

**హైదరాబాద్, ఏప్రిల్ 8 ప్రభాతవార్త:** సనత్‌నగర్‌లోని శ్రీహనుమాన్ దేవాలయం ప్రాంగణంలో ఉన్న అయ్యప్ప స్వామి ఆలయంలో బుధవారం ఉత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ ఉత్సవాల్లో భాగంగా ఉదయం 4 గంటలకు స్వామికి సుప్రభాత దర్శనం, రుద్రాభిషేకం తదితర సేవా కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమాల్లో ఎఐసిసి జాతీయ కో-ఆర్డినేటర్ డా.పి. రవిశేఖర్‌రెడ్డి పాల్గొని స్వామివారికి ప్రత్యేకంగా పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఫణి స్వామి, సీతారాంరెడ్డి, నాగరాజు, సోమేష్‌కుమార్, భరత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ ఐక్య సంఘానికి ఎన్నికలు నిర్వహించాలి



సమావేశంలో మాట్లాడుతున్న కుందారం గణేషాచారి

**సైఫాబాద్, ఏప్రిల్ 8 ప్రభాతవార్త:** విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ ఐక్య సంఘంకు ఎన్నికలు జరిపి నూతన కార్యవర్గాన్ని ఏర్పాటు చేయాలని, అక్రమాలకు పాల్పడుతున్న ఎర్రోజు బిక్షపతిని సంఘం నుంచి బహిష్కరించినట్లు సంఘం ప్రధాన కార్యదర్శి కుందారం గణేషాచారి, అసోసియేట్ అధ్యక్షుడు కౌల జగన్నాధం చెప్పారు. ప్రోటో కాల్ పట్టించుకోకుండా ఇష్టానుసారంగా వ్యవహరిస్తూ విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ ఐక్య సంఘాన్ని తప్పుత్రోవ పట్టిస్తూ విశ్వకర్మలను ఆయోమయానికి గురిచేస్తున్నారని వారు ఆరోపించారు. ఈ మేరకు బుధవారం ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ బిక్షపతి మాటలు నమ్మి విశ్వబ్రాహ్మణులు మోసపోరాదని, త్వరలో నిర్వహించే సమావేశానికి, ఎన్నికలకు, తమ సంఘానికి ఏలాంటి సంబంధం లేదని, ఎన్నికల్లో విశ్వకర్మలు ఎవరూ పాల్గొనరాదని సూచించారు. ఐక్య సంఘం కాలం ముగియడంతో తానే అధ్యక్షుడిగా కొనసాగడానికి బిక్షపతి రకరకాల ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. త్వరలో వేదాస్ సంస్థ ఎన్నికల తేదీన ప్రకటిస్తుందన్నారు. ఈ సమావేశంలో సంఘం కోశాధికారి మధు, మాజీ ప్రధాన కార్యదర్శి అనంతోజు బ్రహ్మచారి, నాయకుడు శ్రీనివాసచారి తదితరులు పాల్గొన్నారు.

### కేబుల్ టివి జర్నలిస్టులకు అక్రిడేషన్ కార్డులు ఇవ్వాలి

**సైఫాబాద్, ఏప్రిల్ 8 ప్రభాతవార్త:** అర్హులైన జర్నలిస్టులందరికి అక్రిడేషన్ కార్డులు ఇవ్వాలని తెలంగాణ కేబుల్ టివి జెఎసి కన్వీనింగ్ కమిటి, నిర్వహణ కన్వీనర్స్ కమి టీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. బుధవారం బషీర్ బాగ్ ప్రెస్‌క్లబ్‌లో జెఎసి ఆధ్వర్యంలో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో కమిటీ ప్రతినిధులు బి.నరసింహా చారి, బరిగెల శివ, యాసిఫ్ పాషా , పొదుల్ల వెంకట్ తదితరులు పాల్గొని మాట్లాడారు. కేబుల్ టివికి రాష్ట్ర స్థాయి హోదా గల కార్డులు అందించాలని, నెట్‌వర్క్ ఉన్న ప్రతి జిల్లాలో ఆరు కార్డులకు అవకాశం కల్పించాలని, డిమాండ్ చేశారు.

## పర్యావరణ పరిరక్షణలో భావి పౌరులంతా భాగస్వాములవ్వాలి : పిసిబి శాస్త్రవేత్త ప్రసన్న కుమార్



తెలంగాణ పొల్యూషన్ కంట్రోలు బోర్డు(పిసిబి) శాస్త్రవేత్త ప్రసన్న కుమార్‌ను కలిసిన నార్సింగి గీతాంజలి వేదిక విద్యార్థులు.

**నార్సింగి, ఏప్రిల్ 8 ప్రభాతవార్త :** భావి భారత పౌరులంతా పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములవ్వాలని తెలంగాణ పిసిబి సీనియర్ సోషల్ శాస్త్రవేత్త డాక్టర్ ప్రసన్న కుమార్ పేర్కొన్నారు. బుధవారం నార్సింగికి చెందిన గీతాంజలి వేదిక 9.వ,తరగతి విద్యార్థులు పర్యావరణ కాలుష్యం, వాయు కాలుష్యం, వాహన కాలుష్యం నియంత్రణపై అవగాహన పెంచుకునేందుకు తెలంగాణ పిసిబిని సందర్శించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు విద్యార్థులకు కాలుష్యంపై చక్కటి ఉదాహరణలతో అవగాహన కల్పించారు. ప్రసన్న కుమార్ మాట్లాడుతూ నైట్రోజన్ ఆక్సైడ్‌లు, కార్బన్ ఉద్గరాలు, బెంజిన్, ఓజోన్ వంటి కాలుష్య కారకాలు ఊపిరితిత్తుల వ్యాధులు, ఇతర అనారోగ్యాలను కలిగిస్తాయని వివరించారు. వాహనాలను అవసరం లేకున్నా ఆన్‌లోనే ఉంచడం, రోడ్ల దుస్థితి, ఇంజిన్ నాణ్యత లోపం, సరైన నిర్వాహణ లేకపోవడం, కల్తీ పెట్రోలు వినియోగం వలన పెద్ద మొత్తంలో వాతావరణంలోకి కాలుష్యం వెలువడుతుందని తెలిపారు. అనంతరం పర్యావరణ శాస్త్రవేత్త జె.సుమతి మాట్లాడుతూ ఇష్టానుసారంగా రోడ్లపై చాక్లెట్ల కవర్లు, క్యారీబ్యాగ్‌లు ప్లాస్టిక్ వ్యర్థాలను రోడ్లపై వేయడం పర్యావరణంకు హాని చేస్తుందని వివరించారు. మనం వాడిన తరువాత వెలువడే వృధా కవర్లు, ఇతర కారకాలను రోడ్లపై కాకుండా విధిగా చెత్త డబ్బాలలోనే వేయడం అలవాటు చేసుకోవాలని సూచించారు. స్వీచ్‌ఈకో వ్యవస్థాపకుడు అక్షయ్ వాయు కాలుష్యంపై ప్రజెంటేషన్ ఇచ్చి కాలుష్యంను తగ్గించే మార్గాలను వివరించారు. ఎలక్ట్రిక్ వాహనాలు, హైడ్రోజన్ ఇంధనం, సిఎన్‌జి వంటి పర్యావరణ హితమైన వాహనాలను వాడడం వలన పర్యావరణ కాలుష్యం కొంత వరకు తగ్గుతుందన్నారు. ఈ కార్యక్రమంలో గీతాంజలి వేదిక ఉపాధ్యాయులు కల్పన, విజయశాంతి, ప్రసాద్ విద్యార్థులు పాల్గొన్నారు.

## పౌల్ట్రీ రీసెర్చ్ స్టేషన్‌ను సందర్శించిన అంతర్జాతీయ ప్రతినిధుల బృందం



**అత్తాపూర్ ఏప్రిల్ 8,ప్రభాతవార్త :** పివి నర్సింహారావు తెలంగాణ పశువైద్య విశ్వవిద్యాలయంలోని రాజేంద్రనగర్ పౌల్ట్రీ రీసెర్చ్ స్టేషన్‌ను బుధవారం 25 మంది సభ్యులతో కూడిన అంతర్జాతీయ ప్రతినిధుల బృందం సందర్శించింది. నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ అగ్రికల్చరల్ ఎక్స్‌టెన్షన్ మేనేజ్‌మెంట్ ఆధ్వర్యంలో అగ్రికల్చరల్ వాల్యూ చైన్ పై జరుగుతున్న అంతర్జాతీయ శిక్షణా కార్యక్రమంలో భాగంగా ఈ పర్యటన జరిగింది.ఈ సందర్శనలో ఆసియా మరియు ఆఫ్రికా ఖండాలకు చెందిన సుమారు 25 దేశాల వ్యవసాయ మరియు అనుబంధ విభాగాల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ డైద కృష్ణ ప్రసాద్ (ప్రిన్సిపాల్ సైంటిస్ట్ హెడ్ ,పిఆర్ ఎస్) . ప్రొఫెసర్ అనిల్ పవన్ ప్రతినిధులకు పౌల్ట్రీ రీసెర్చ్ స్టేషన్‌లో జరుగుతున్న వివిధ పరిశోధనలు మరియు అభివృద్ధి కార్యక్రమాలపై వివరణా ఇచ్చారు.ముఖ్యంగా కోళ్లలో ఉత్పాదకతను పెంచడానికి అవసరమైన శాస్త్రీయ పద్ధతులు మరియు నూతన సాంకేతికతలు.వ్యాధి నిరోధకత ,వ్యాధుల నియంత్రణ మరియు కోళ్ల ఆరోగ్యంపై తీసుకుంటున్న చర్యలు.వివిధ దేశాల మధ్య వ్యవసాయ మరియు పౌల్ట్రీ రంగాలలో పరస్పర సహకారం, విజ్ఞాన మార్పిడి ద్వారా సాధించగల ఫలితాలు.విదేశీ ప్రతినిధులు పౌల్ట్రీ రంగంలో ఇక్కడ జరుగుతున్న అద్భుతమైన కృషిని చూసి సంతోషం వ్యక్తం చేశారు. తమ దేశాల్లో కూడా ఇటువంటి శాస్త్రీయ పద్ధతులను అమలు చేయడానికి ఇక్కడి పరిశోధనలు ఎంతో దోహదపడతాయని వారు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయశాస్త్రవేత్తలు సి హెచ్ . రామకృష్ణ అసోసియేట్ ప్రొఫెసర్ మరియు అధికారులు పాల్గొన్నన్నారు.

### మంచినీటిలో డ్రైనేజీ కలుషితంపై పరిష్కారం చూపాలి



వాటర్ వర్క్స్ జిఎం టి. శ్రీధర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించిన దృశ్యం

**చిక్కడపల్లి ఏప్రిల్ 8, ప్రభాతవార్త :** బాగ్ లింగంపల్లి ఎల్ఐజి క్వార్టర్స్ పరిధిలో గత వారం రోజులుగా మంచినీటి సరఫరాలో మురుగునీరు కలిసి వస్తుండటంపై స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యపై హైదరాబాద్ సిటిజన్స్ ఫోరం ప్రతినిధులు బుధవారం వాటర్ వర్క్స్ జిఎం టి. శ్రీధర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా ఫోరం ప్రధాన కార్యదర్శి వీరయ్య మాట్లాడుతూ బ్లాక్ 35, 36, 37 లైన్ లలో దుర్వాసనతో కూడిన నల్లటి నీరు వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో బోలక్‌పూర్ వంటి ప్రాంతాల్లో జరిగిన కలుషిత నీటి మరణాలను గుర్తు చేస్తూ, అపరిశుభ్ర నీటి వల్ల ప్రాణహాని కలిగే ప్రమాదం ఉందని హెచ్చరించారు. అనారోగ్య భయంతో ప్రజలు అధిక ధరలు చెల్లించి మినరల్ వాటర్ కొనుగోలు చేస్తున్నారని తెలిపారు. ఫిర్యాదులపై స్పందించిన జిఎం శ్రీధర్ స్వయంగా ఎల్ఐజి క్వార్టర్స్ ప్రాంతాన్ని సందర్శించి పరిస్థితిని సమీక్షించారు. పైపులైన్ల లీకేజీలను గుర్తించి తక్షణమే సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అయితే, కేవలం తాత్కాలిక మరమ్మతులు కాకుండా, పైపులైన్ల మార్పు ద్వారా శాశ్వత పరిష్కారం చూపాలని ఫోరం నేతలు డిమాండ్ చేశారు.ఈ కార్యక్ర మంలో హెచ్‌సిఎఫ్ నాయకులు శ్రీనివాసరావు, మోహన్‌నాయు డు, రితీష్, సత్యనారాయణ,రమణ, కిరణ్,సుశాంత్ పాల్గొన్నారు.

### దళిత రత్న అవార్డు గ్రహీత లక్ష్మణ్ కుమార్‌కు సన్మానం



**అంబర్ పేట, ఏప్రిల్ 8 ,ప్రభాతవార్త :**

బాబు జగ్జీవన్ రామ్,డాక్టర్ అంబేద్కర్ జయంతి ఉత్సవ కమిటీ తెలంగాణ రాష్ట్రం ఆధ్వర్యంలో భారత మాజీ ఉప ప్రధాని డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ 119 వ జయంతి సందర్భంగా లక్ష్మణ్ కుమార్ కు దళిత రత్న అవార్డు దక్కింది.ఈనెల 5వ తేదీన జగ్జీవన్ రామ్ జయంతి సందర్భంగా రవీంద్రభారతిలో జరిగిన కార్యక్రమంలో లక్ష్మణ్ కుమార్ కు అందజేశారు. బుధవారం బిజెపి పార్టీ నాయకులు,ఎస్సీ సంఘాలు నాయకుల సంయుక్త ఆధ్వర్యంలో నల్లకుంట కార్యాలయంలో లక్ష్మణ్ కుమార్ ను సన్మాన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.... మొదటిసారిగా ఎస్సీ 59 ఉపకులాల్లో సంగర చర్మకార్ కులాన్ని గుర్తించి అవార్డు ఇవ్వడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు. రాబోయే రోజుల్లో ఎస్సీ ఇతర ఉపకులాలను గుర్తించాలని ఆయన కోరారు. అంబర్ పేట నియోజకవర్గం సంఘరా చర్మకార్ సంఘం ఎన్నికల్లో హ్యాట్రిక్ విజయంతో అధ్యక్షుడిగా 15 సంవత్సరాలుగా సేవలు అందిస్తున్నానని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకులు కే జే బాబు, ఓబిసి సిటీ కార్యనిర్వాహక సభ్యులు మధుసూదన్, ఎస్సీ మోర్చా అంబర్ పేట నియోజకవర్గం కన్వీనర్ శివకుమార్,యువ మోర్చా అధ్యక్షుడు సుమన్, ఎమ్మార్పీఎస్ నాయకులు యాదయ్య, నల్లకుంట బిజెపి డివిజన్ ప్రధాన కార్యదర్శి కిషోర్ కుమార్ పాల్గొన్నారు

### శ్రీశైలం ఆలయాన్ని దర్శించుకున్న మంత్రి కొండా సురేఖ



కుమార్తె, మనుమడితో ఆలయంలో మంత్రి కొండా సురేఖ

**జూబ్లీహిల్స్, ఏప్రిల్ 8, ప్రభాతవార్తః** చదరంగంలో మనువడు సాధించిన ప్రపంచ రికార్డు నేపథ్యంలో మంత్రి కొండా సురేఖ బుధవారం తన కుమార్తె సుష్మితా పటేల్, మనువడు శ్రేయాన్ష్ మురళీ కృష్ణ పటేల్‌తో కలిసి శ్రీశైలంలోని భ్రమరాంబ మల్లికార్జున స్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు వారికి అధికార లాంఛనాలతో స్వాగతం పలికారు. అనంతరం వారు అక్కడ నిర్వమిచిన అమ్మవారి కుంకుమార్చన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈఓ ఎం. శ్రీనివాసరావు మంత్రికి శ్రీభ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి చిత్రపటాన్ని అందించారు. తన కుమార్తెతో కలిసి మొక్కులు చెల్లించుకున్నట్లు మంత్రి సురేఖ స్పష్టం చేశారు.

### పుచ్చకాయల విక్రయానికి వచ్చిన డీసీఎం డ్రైవర్ అదృశ్యం?

**ఎల్.బి.నగర్, ఏప్రిల్ 8 ప్రభాతవార్త:** డీసీఎం వాహనంతో పుచ్చకాయలు అమ్మేందుకు వచ్చి డ్రైవర్ అదృశ్యమైన ఘటన స్థానికంగా కలకలం రేపింది. ఈ సంఘటన నాగోల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఇన్స్పెక్టర్ మహమ్మద్ మక్బూల్‌జానీ తెలిపిన వివరాల ప్రకారం?కామారెడ్డి జిల్లా లింగపేట్ మండలం మంగరం గ్రామానికి చెందిన కొమ్ముల రవియాదవ్ (37) డ్రైవర్‌గా పనిచేస్తూ జీవనోపాధి కోసం డీసీఎం వాహనంలో పుచ్చకాయలు తీసుకుని తన గ్రామస్తులతో కలిసి ఈ నెల 3వ తేదీన నాగోల్ ప్రాంతానికి వచ్చాడు. ఆల్కాపురి ఎక్స్‌రోడ్ వద్ద ఉన్న ఖాళీ స్థలంలో డీసీఎంను నిలిపి పుచ్చకాయల వ్యాపారం చేస్తున్నాడు. కాగా ఈ నెల 6వ తేదీన అక్కడి నుండి వెళ్లిన రవియాదవ్ తిరిగి ఇంటికి చేరుకోకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారు. అతను ఎక్కడికి వెళ్లాడో ఇప్పటివరకు ఎలాంటి సమాచారం లభించలేదు.ఈ మేరకు కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో నాగోల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. డ్రైవర్ ఆచూకీ కోసం ప్రత్యేక బృందాలు గాలింపు చర్యలు చేపట్టినట్లు తెలిపారు.రవియాదవ్ గురించి ఎవరికి అయినా సమాచారం తెలిసిన పక్షంలో సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు.

### గుర్తు తెలియని వృద్ధుని మృతదేహం లభ్యం

**ముషీరాబాద్, ఏప్రిల్ 8, ప్రభాతవార్త:** గుర్తు తెలియని వృద్ధుని (70) మృతదేహాన్ని దోమలగూడ పోలీస్‌లు గుర్తించారు. దోమలగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఎన్టీఆర్ స్టేడియంలో ఒక వృద్ధుడు పడిపోయి ఉన్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు, ఘటనా స్థలికి వెళ్లి చూడగా, వృద్ధుడు మృతి చెంది ఉన్నాడు. ఆ వృద్ధునికి సంబంధించిన వివరాలు విచారించగా, స్థానికులు ఎవరూ చెప్పలేకపోయారు. అతను ఉన్న స్థితిని బట్టి భిక్షాటన చేసుకునే వ్యక్తిగా నిర్ధారణకు వచ్చిన పోలీసులు, అతని మృతదేహాన్ని గాంధీఆసుపత్రికి తరలించి, మార్చురీలో భద్రపరిచారు. ఆ వ్యక్తికి సంబంధించిన వారు ఎవరైనా ఉంటే దోమలగూడ పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని సూచించారు.

### అసభ్య ప్రవర్తనకు రెండు రోజుల జైలు

**జూబ్లీహిల్స్, ఏప్రిల్ 8, ప్రభాతవార్తః**

బంధువుల అమ్మాయితో అసభ్యంగా ప్రవర్తించిన ఒక ఆటో డ్రైవర్‌కు కోర్టు రెండు రోజుల జైలుశిక్ష విధించింది. ఫిల్మ్‌నగర్ పోలీసుల కథనం ప్రకారం.. ఫిల్మ్‌నగర్‌లోని మహాత్మగాంధీ నగర్‌లో ఆటో డ్రైవర్ చంద్రశేఖర్ చంటి(35) నివసిస్తాడు. ఫిల్మ్‌నగర్ ప్రాంతంలో జరిగిన ఒక శుభకార్యానికి తన బంధువుల అమ్మాయి రాగా ఆమెతో అతను అసభ్యంగా ప్రవర్తించాడు. దీంతో ఆమె వెంటనే ఫిల్మ్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు చంద్రశేఖర్ చంటిపై పెట్టీ కేసు నమోదు చేసి బుధవారం న్యాయస్థానంలో హాజరుపర్చారు. నిందితుడికి రెండు రోజుల జైలుశిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు. దీంతో నిందితుడిని చంచల్‌గూడ జైలుకు తరలించినట్లు ఫిల్మ్‌నగర్ పోలీసులు తెలిపారు.

### అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం పట్టివేత

**ఎల్.బి.నగర్, ఏప్రిల్ 8 ప్రభాతవార్త:**

పేదల సంక్షేమం కోసం ప్రభుత్వం పంపిణీ చేస్తున్న రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్న పోలీసులు పట్టుకున్నారు. ఈ సంఘటన నాగోల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. వాహనాలు తనిఖీల నేపథ్యంలో నాగోల్ పోలీసులు తనిఖీ చేస్తుండగా 26 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని తరలిస్తుండగా వాటిని స్వాధీనం చేసుకొని నిందితుడిని అరెస్ట్ చేశారు.నాగోల్ పోలీస్‌స్టేషన్ సీఐ మహమ్మద్ మక్బూల్‌జానీ తెలిపిన వివరాల ప్రకారం... ఉమ్మడి నల్లగొండ జిల్లా తుర్కపల్లి మండలం పెన్‌పహాడ్ గ్రామానికి చెందిన రవినాయక్ అనే వ్యక్తి టీఎస్ 30 టీఏ 4286 నంబర్ టాటా ఏస్ వాహనంలో భారీగా రేషన్ బియ్యాన్ని అక్రమంగా శంషాబాద్ ప్రాంతానికి తరలిస్తున్నాడు.ఈ నేపథ్యంలో మంగళవారం నాగోల్ చౌరస్తా వద్ద ఎస్ఐ రమేష్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సాధారణ వాహనాల తనిఖీలలో భాగంగా సంబంధిత వాహనంపై అనుమానం కలగడంతో పోలీసులు దానిని ఆపి తనిఖీ చేశారు. తనిఖీలలో వాహనంలో పెద్ద మొత్తంలో రేషన్ బియ్యం నిల్వ ఉంచి తరలిస్తున్నట్లు గుర్తించారు.పరిశీలనలో భాగంగా వాహనంలో సుమారు 26 క్వింటాళ్ల రేషన్ బియ్యం ఉన్నట్లు శంషాబాద్ ప్రాంతంలోని ఇటుక బట్టీలలో పనిచేసే కూలీలకు విక్రయించేందుకు తీసుకెళుతున్నట్లు నిర్ధారించినట్లు సిఐ పేర్కొన్నారు. ప్రభుత్వం పేదలకు సరఫరా చేసే ఈ బియ్యాన్ని అక్రమంగా ఇతర ప్రాంతాలకు తరలించి లాభాపేక్షతో విక్రయించేందుకు ప్రయత్నిస్తున్నట్లు పోలీసులు భావిస్తున్నారు.ఈ ఘటనపై నిందితుడిపై 7 ఈసీ పీడీ యాక్ట్ కింద కేసు నమోదు చేసిన పోలీసులు, స్వాధీనం చేసుకున్న బియ్యాన్ని పౌరసరఫరాల శాఖ అధికారులకు అప్పగించారు. అనంతరం నిందితుడిని అదుపులోకి తీసుకుని కోర్టులో హాజరు పరిచి రిమాండ్‌కు తరలించారు.ఇలాంటి అక్రమ రవాణాలపై ప్రత్యేక నిఘా ఉంచి కఠిన చర్యలు తీసుకుం టామని పోలీసులు హెచ్చరించారు. ప్రజలు కూడా అనుమానాస్పదంగా రేషన్ సరుకుల తరలింపు గమనించిన వెంటనే సమీప పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందించాలని సూచించారు.



మంచి నీటి ట్యాంకును పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ దండి లక్ష్మి

## అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు అందేలా చూస్తాం

### మున్సిపల్ చైర్‌పర్సన్ దండి లక్ష్మీకొమురయ్య

**హుస్నాబాద్ రూరల్, ఏప్రిల్ 8, ప్రభాతవార్త:** అర్హులందరికి ఇందిరమ్మ ఇళ్లు అందేలా చర్యలుతీసుకుంటామని హుస్నాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ దండి లక్ష్మీకొమురయ్య అన్నారు. బుధవారం పట్టణంలోని 12వ వార్డులో ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి కౌన్సిలర్, మున్సిపల్ విప్ కేడేవర్ రమేష్‌తో కలిసి భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం పేదలకు గృహ సౌకర్యం కల్పించేందుకు ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తోందని, అర్హులైన ప్రతి కుటుంబానికి ఇల్లు అందేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. అనంతరం వార్డులో ఉన్న మంచినీటి ట్యాంకర్‌ను శుభ్రం చేయించారు. ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందేలా అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నాయకులు, మున్సిపల్ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

### అంగన్‌వాడీలో అక్షరాభ్యాసం...

**హుస్నాబాద్ టౌన్, ఏప్రిల్ 8, ప్రభాతవార్త:** పట్టణంలోని పోచమ్మవాడ అంగన్‌వాడీ కేంద్రంలో అక్షరాభ్యాసం, అన్నప్రాసన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మున్సిపల్ చైర్‌పర్సన్ దండి లక్ష్మీకొమురయ్య, కౌన్సిలర్ బూరుగు లతాకిష్టస్వామి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. అంగన్‌వాడీ టీచర్ బూరు సరిత ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆశా కార్యకర్తలు, గర్భిణీలు, బాలింతలు, చిన్నారులు, బాలికలు పాల్గొన్నారు. చిన్నారులకు అక్షరాభ్యాసం నిర్వహించడంతో పాటు అన్నప్రాసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రానికి నూతన కమిటీని ఎన్నిక చేసి, సభ్యులకు వారి బాధ్యతలను వివరించారు. చిన్నారుల ఆరోగ్యం, పోషకాహారం, విద్యపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని నాయకులు సూచించారు. ఈ కార్యక్రమం ద్వారా చిన్నారుల విద్యా ప్రాముఖ్యతతో పాటు పోషకాహార అవసరాలపై అవగాహన కల్పించారు.

## ప్రతి బాలికా హెచ్‌పివి వ్యాక్సిన్ వేసుకోవాలి

### మంత్రి పొన్నం ప్రభాకర్



అవగాహన పోస్టర్ ఆవిష్కరిస్తున్న దృశ్యం

**హుస్నాబాద్ రూరల్, ఏప్రిల్ 8, ప్రభాతవార్త :** రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ బుధవారం హైదరాబాద్‌లోని మినిస్టర్ క్వార్టర్స్‌లో గర్భాశయ క్యాన్సర్ నివారణకు సంబంధించిన హెచ్‌పివి వ్యాక్సిన్ అవగాహన పోస్టర్‌ను ఆవిష్కరించారు. సినీ నటుడు అల్లు అర్జున్ జన్మదినాన్ని పురస్కరించుకుని, సామాజిక బాధ్యతగా ఫ్యాన్స్ అసోసియేషన్ ఈ కార్యక్రమాన్ని చేపట్టారని మంత్రి తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మహిళా ఆరోగ్యం పట్ల సమాజంలో అవగాహన పెరగాలని ఆకాంక్షించారు. ముఖ్యంగా 14 ఏళ్ల వయస్సు నిండిన ప్రతి బాలిక ఈ వ్యాక్సిన్ వేసుకోవాలని, తద్వారా భవిష్యత్తులో గర్భాశయ క్యాన్సర్ ముప్పు నుంచి రక్షణ పొందవచ్చని వివరించారు. తన పుట్టినరోజు సందర్భంగా అభిమానులు కేవలం వేడుకలకే పరిమితం కాకుండా, ఇలాంటి ఆరోగ్య స్పృహ కలిగించే కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని ఆయన కొనియాడారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర అల్లు అర్జున్ ఫ్యాన్స్ అధ్యక్షులు అంజి యాదవ్, రాష్ట్ర నాయకులు పైసా శ్రీకాంత్, కొండేటి సతీష్, దొబ్బల అనిల్, వేముగంటి శ్రీకాంత్ పాల్గొన్నారు.

## శ్రీరాములపల్లిలో భూ సర్వే-రీ సర్వేపై అవగాహన సదస్సు



అవగాహన సదస్సు నిర్వహిస్తున్న దృశ్యం

**కోహెడ, ఏప్రిల్ 8,ప్రభాతవార్త :** భూభారతి చట్టంలో భాగంగా బుధవారం మండల పరిధిలోని శ్రీరాములపల్లి గ్రామంలో భూ సర్వే-రీ సర్వే అవగాహన సదస్సు నిర్వహించారు. గ్రామంలోని భూ సమస్యలు పరిష్కరించడానికి శ్రీరాములపల్లి గ్రామాన్ని పైలెట్ ప్రాజెక్టుగా రెవెన్యూ శాఖ తీసుకుంది. రీసర్వే ద్వారా ఇప్పుడున్న భూ సమస్యలు తొలగిపోయి రాబోయే భవిష్యత్ తరాలకు బంగారు బాట వేసిన వారు అవుతారని సర్పంచ్ పోలు శ్రీనివాస్ అన్నారు. కార్యక్రమంలో ఎడి సుదర్శన్, తహశీల్దార్ చంద్రశేఖర్, ఎంపీడీవో కృష్ణయ్య, ఎంపీవో రవీందర్, డిఐ ఇరేష్ డిఈ, ఆర్ఐ, జీపీవో సర్వేయర్ సిబ్బంది,గ్రామ కార్యదర్శి, రైతులు,పంచాయతీ పాలకవర్గం పాల్గొన్నారు.

## బిఆర్ఎస్ బిసి సెల్ మండల అధ్యక్షుడిగా కృష్ణ

**ధూళిమిట్ట, ఏప్రిల్ 8, ప్రభాతవార్త :** భారత రాష్ట్ర సమితి (బిఆర్ఎస్) పార్టీ బీసీ సెల్ మండల అధ్యక్షుడిగా భావండ్లపల్లి కృష్ణను నియమించినట్లు మండల అధ్యక్షుడు మంద యాదగిరి వెల్లడించారు. జనగామ ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఆదేశాల మేరకు ఈ నియామకం చేపట్టినట్లు ఆయన తెలిపారు. పార్టీపట్ల నిబద్ధతతో పనిచేస్తూ, బీసీ వర్గాల అభివృద్ధికి కృషిచేస్తున్న భావండ్లపల్లి కృష్ణ సేవలను గుర్తించి బాధ్యతలు అప్పగించినట్లు పార్టీ నాయకులు పేర్కొన్నారు. మండల స్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయడం, బీసీ వర్గాల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లడం, సంక్షేమ పథకాలు ప్రజలకు అందేలా కృషి చేయడం తన ప్రధాన లక్ష్యమని భావండ్లపల్లి కృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా తనపై విశ్వాసం ఉంచి కీలక బాధ్యతలు అప్పగించిన ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్ రెడ్డి, మండల అధ్యక్షులు మంద యాదగిరి, పార్టీ ఉన్నత నాయకత్వానికి ఆయన హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. పార్టీ అభివృద్ధి కోసం కష్టపడి పనిచేస్తానని, ప్రజల సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని ఆయన హామీ ఇచ్చారు. ఈ నియామకంపై పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు కృష్ణకు శుభాకాంక్షలు తెలిపారు.



కృష్ణకు సన్మానిస్తున్న పార్టీ నాయకులు

# ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సీఎం ఫోటో తప్పనిసరి

### సర్పంచ్ పత్తి నర్సింలుయాదవ్



మాట్లాడుతున్న నర్సింలుయాదవ్

**మర్కుక్, ఏప్రిల్ 8 (ప్రభాతవార్త):** గజ్వేల్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఫోటోను తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని దామరకుంట సర్పంచ్ పత్తి నర్సింలుయాదవ్ డిమాండ్ చేశారు. బుధవారం మండల పరిధిలోని దామరకుంటలో ఆయన మాట్లాడుతూ సిద్దిపేట కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు తూంకుంట ఆంక్షరెడ్డి సమక్షంలో సీఎం చిత్రపటాన్ని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసినప్పటికీ కొందరు బీఆర్ఎస్ నేతలు కావాలని తొలగించడాన్ని తీవ్రంగా ఖండించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ముఖ్యమంత్రి చిత్రపటం ప్రభుత్వ కార్యాలయాల్లో ఉండడం సాధారణమని పేర్కొన్నారు. అధికారిక క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి చిత్రపటాన్ని తొలగించడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని విమర్శించారు. ఈ ఘటనతో రాజకీయంగా ఉద్రిక్తత సృష్టించే ప్రయత్నం జరుగుతుందని ఆరోపించారు. కావాలనే మూడు రోజుల క్రితం గజ్వేల్ బంద్‌కు బీఆర్ఎస్ పిలుపునివ్వడం సిగ్గుచేటని విమర్శించారు. ప్రజల్లో అసత్య ప్రచారం చేస్తూ రాజకీయ లబ్ధి పొందాలని బీఆర్ఎస్ నేతలు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. ఇటువంటి చర్యలు ప్రజాస్వామ్యాన్ని అవమానించేవిధంగా ఉన్నాయని పేర్కొన్నారు. ఇప్పటికైనా ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్రపటాన్ని తిరిగి ఏర్పాటు చేయాలని, లేదంటే కాంగ్రెస్ పార్టీ తరపున ఆందోళనలు చేపట్టాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ దేవి విజయరమేష్, మాజీ సర్పంచ్ స్వప్న వెంకటేష్, వార్డు సభ్యులు రాజబోయిన రమేష్, నాయకులు పరమేష్, మాదరి బాలరాజ్, జిట్ట బాలచందర్, పత్తి భానుయాదవ్ పాల్గొన్నారు.



గజ్వేల్ ప్రభుత్వాసుపత్రి డాక్టర్ అన్నపూర్ణను సన్మానిస్తున్న దృశ్యం

## డాక్టర్ అన్నపూర్ణకు ఘన సన్మానం

**గజ్వేల్ టౌన్, ఏప్రిల్ 8 (ప్రభాతవార్త):** వైద్య ఆరోగ్య శాఖలో విశేష ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పురస్కారం అందుకున్న గజ్వేల్ జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అన్నపూర్ణను బుధవారం ఆసుపత్రిలో వైద్యులు, నర్సింగ్ మరియు ఇతర సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా డాక్టర్ అన్నపూర్ణ మాట్లాడుతూ సిద్దిపేట జిల్లాను వైద్య ఆరోగ్య రంగంలో రాష్ట్రంలోనే అగ్రగామిగా నిలిపేందుకు తనవంతు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి ఆర్ఎంవో డాక్టర్ రాము, డాక్టర్ శ్రీధర్, డాక్టర్ ప్రణీత, లయన్స్ క్లబ్ ఆఫ్ స్నేహ ఉపాధ్యక్షుడు డాక్టర్ కుమారస్వామి, సీనియర్ అసిస్టెంట్ సతీష్‌కుమార్, లలిత, భాను, ఫార్మసీ ఆఫీసర్స్ ఎప్సీబా, శశిప్రియ, స్వర్ణలత, మోహన్ బండారి, హెల్త్ అసిస్టెంట్ దేవసాని వాసుదేవ్, ప్రభాకర్, చీఫ్ వీడియో గ్రాఫర్ విద్యాసాగర్, నర్సింగ్ ఆఫీసర్స్ షాహిన్, ఉమామహేశ్వరి, నజీర్‌అహ్మద్, గౌతమ్, సానిటరీ ఇన్‌స్పెక్టర్ లక్ష్మి, ఇన్ఫెక్షన్ కంట్రోల్ నర్సింగ్ ఆఫీసర్ మేహారాజ్ భాను, ఆరోగ్య మిత్ర గంగాల సురేందర్, సిబ్బంది సుధాకర్, వెంకటేష్, రమేషన, జీవన, రచన, దుర్గాప్రసాద్, మధు, కమలాకర్, కనకయ్య, పరశురాములు, రఘుపతి బాలయ్య, శేఖర్, సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.

## శేఖర్ గౌడ్ సేవలు చిరస్మరణీయం

**మాడ్గుల, ఏప్రిల్ 8, ప్రభాతవార్త:** కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ సర్పంచ్ దండు శేఖర్‌గౌడ్ మృతి పట్ల ఏఐసీసీ కార్యదర్శి చల్లా వంశీచంద్ రెడ్డి సంతాపం వ్యక్తం చేశారు. బుధవారం మాడ్గుల మండలం అర్కపల్లిలోని శేఖర్ గౌడ్ నివాసానికి వెళ్లి ఆయన చిత్రపటానికి పూల మాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. వార్డు సభ్యుడిగా రాజకీయ ప్రస్థానం మొదలు పెట్టి, ప్రజల మధ్య ఉండే నాయకుడిగా ఆయన గుర్తింపు పొందారని కొనియాడారు. శేఖర్‌గౌడ్ మరణం పార్టీకి తీరని లోటని, ఆయన కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పీసీసీ సభ్యులు అయిల్ల శ్రీనివాస్ గౌడ్, మండలం అధ్యక్షులు కిషన్ రెడ్డి, మాజీ జడ్పీటీసీ ప్రభాకర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, సర్పంచ్ కల్లు భాగ్యలక్ష్మి తిరుపతిరెడ్డి, మాజీ సర్పంచ్‌లు ఏర్పుల జంగయ్య, రవీందర్ రెడ్డి, కొండల్ రెడ్డి, ఉపసర్పంచ్ రవీందర్, సిర్సవాడ శ్రీనివాస్, బిక్కయ్య, శ్రీశైలం, శివరాజు గౌడ్, జానీ, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

## తాగునీటిని వృథాచేయకండి : సర్పంచ్

**కుల్కచర్ల, ఏప్రిల్, 8 ప్రభాతవార్త:** గ్రామంలో తాగు నీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకుంటామని సర్పంచ్ సీతారాం నాయక్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని ఎత్తుకాల్వ తాండ గ్రామ పంచాయతీలో నీటి సమస్య ఉందని గుర్తించి వెంటనే నూతన బోరు మోటర్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ సీతారాం నాయక్ మాట్లాడుతూ.. వేసవిని దృష్టిలో ఉంచుకుని గ్రామంలో నీటి సమస్య ఎక్కడ ఉన్న పరిష్కరిస్తునట్లు తెలిపారు. ప్రజలు నీటిని వృథాచేయాకుండా పొదుపుగా వాడుకోవాలని సూచించారు.

## ప్రైవేట్ సెంటర్‌లో రేషన్ బియ్యం నిల్వలా?

### పుట్టపహాడ్ పంచాయతీ పాలకవర్గం ఆగ్రహం

**కుల్కచర్ల, ఏప్రిల్, 8 ప్రభాతవార్త:** పుట్టపహాడ్ గ్రామంలో రేషన్ బియ్యాన్ని ప్రభుత్వ భవనాల్లో కాకుండా ప్రైవేట్ సెంటర్లలో నిల్వ చేయడంపై గ్రామ పంచాయతీ పాలక వర్గం ఆగ్రహం వ్యక్తం చేసింది. ప్రైవేట్ సెంటర్ల ద్వారా బియ్యం పంపిణీ చేయడం వల్ల ప్రజల్లో పలు అనుమానాలు కలుగుతున్నాయని, డీలర్‌కు ఎన్నిసార్లు చెప్పినా వినడం లేదని వారు ఆరోపించారు. దీనిపై డీలర్‌ను ప్రశ్నిస్తుంటే ప్రైవేట్ సెంటర్ వ్యక్తులు తమపై దాడికి పాల్పడుతున్నారని వారు పేర్కొన్నారు. వెంటనే అధికారులు స్పందించి ప్రభుత్వ భవనం నుండి బియ్యం పంపిణీ అయ్యేలా చూడాలని కోరారు. బుధవారం గ్రామ పంచాయతీ పాలక వర్గ సభ్యులు గ్రామ ప్రజలతో కలిసి మీడియాకు ఈ వివరాలు వెల్లడించారు.

## వేసవిలో చలివేంద్రాలు ఉపశమనం

**షాద్‌నగర్, ఏప్రిల్ 8, ప్రభాతవార్త :** షాద్‌నగర్ ప్రభుత్వ ఆసుపత్రి సమీపంలో 13వ వార్డు బీఆర్ఎస్ యువనాయకులు కొండ మల్లేష్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా అంజయ్యయాదవ్ మాట్లాడుతూ.. పెరుగుతున్న వేసవి తీవ్రతలో ప్రజల దాహాన్ని తీర్చేందుకు చలివేంద్రాలు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. ప్రజల సేవే తమ లక్ష్యమని, ఇలాంటి సేవా కార్యక్రమాలు సమాజానికి ఆదర్శంగా నిలుస్తాయని అన్నారు. పట్టణ కౌన్సిలర్లు పిల్లి శారద శేఖర్, వసంత శ్రీనివాస్, జయలక్ష్మి కిషోర్, పిన్నమోని గోపాల్, ఎస్పీ శివ, మాజీ కౌన్సిలర్లు కానుగు అనంతయ్య, చిన్న యాదగిరి, మాజీ పీఎసిఎస్ డైరెక్టర్ నందిగామ శ్రీనివాస్, నాయకులు నక్కల వెంకటేష్ గౌడ్, రవి యాదవ్, చెట్ల జంగయ్య, శ్రీనివాస్, జుట్టు బాలరాజ్, పిట్టల నరసింహా, గుండు అశోక్, మంగ శ్రీశైలం, పిట్టల మల్లేష్, సుధాకర్, రాజు, కొండె శివకుమార్, పిల్లి సాయి, వెంకటేష్, మల్లేష్, ముస్తి నరేష్, సందీప్ సింగ్, శ్రీను నాయక్, శీలం శ్రీకాంత్, రాజశేఖర్, నార్ల శ్రీనివాస్, చంటి, వంశీ, కొంకళ్ళ అనిల్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే సహకారంతో విద్యుత్ సమస్యల పరిష్కారం

**షాద్‌నగర్, ఏప్రిల్ 8, ప్రభాతవార్త :**

షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సహకారంతో సోలిపూర్ గ్రామంలో విద్యుత్ సమస్యలను పూర్తిస్థాయిలో పరిష్కరించేందుకు చర్యలు తీసుకున్నామని వార్డు కౌన్సిలర్ సింగపాగ శిరీష అనిల్ కుమార్ స్పష్టం చేశారు. బుధవారం సోలిపూర్ లో 10శాతం పార్కు భూమి, స్మశాన వాటిక ఇంకా తదితర ప్రాంతాలలో విద్యుత్ సమస్యలు పరిష్కారం చేశామని తెలిపారు. నూతన విద్యుత్ స్తంభాలు, విద్యుత్ వైర్లు తదితర సామాగ్రిని ఏర్పాటు చేసుకుని నాణ్యమైన కరెంటును సరఫరా చేసేందుకు పూర్తిస్థాయిలో చర్యలు తీసుకున్నట్లు కౌన్సిలర్ శిరీష అనిల్ కుమార్ స్పష్టం చేశారు. స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సహకారంతో వార్డును పూర్తిస్థాయిలో మౌలిక సదుపాయాల రూపకల్పనలో అభివృద్ధి చేస్తానని ఆమె స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో వెంకటేష్ పంతులు గడ్డం కృష్ణయ్య కుమ్మరి అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

## వేగవంతంగా హైస్కూల్ నిర్మాణ పనులు

**నందిగామ, ఏప్రిల్ 8, ప్రభాతవార్త:** మండల కేంద్రంలో నూతనంగా నిర్మిస్తున్న హైస్కూల్ రెండవ అంతస్తు భవన నిర్మాణం వేగవంతం చేశారు. షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ప్రత్యేక సహకారంతో నిర్మిస్తున్న హైస్కూల్‌ను కార్పొరేట్ పాఠశాలను తలపించే రీతిలో అన్ని హంగులతో, అన్ని మౌలిక సదుపాయాలతో నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేశారు. నిర్మాణ పనులను సర్పంచ్ కొమ్ము కృష్ణ, కాంగ్రెస్ సీనియర్ నేత జిల్లెల్ల బాల్‌రెడ్డి, పూర్వ విద్యార్థులు బి.కృష్ణ యాదవ్, వార్డ్‌సభ్యులు పర్యవేక్షిస్తున్నారు.

## మున్సిపల్ కమిషనర్ ఆకస్మిక తనిఖీ

**జవహర్ నగర్, ఏప్రిల్ 8 ప్రభాతవార్త:** మల్కాజ్గిరి మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి బుధవారం కీసర సర్కిల్ పరిధిలోని యాప్రాల్ వార్డులో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా క్షేత్రస్థాయిలో సానిటేషన్, టౌన్ ప్లానింగ్, ఇంజనీరింగ్, పార్కులు, రెవెన్యూ విభాగాలకు సం బంధించిన పనులను ఆయన నిశితంగా పరిశీలించారు. ముఖ్యంగా పారిశుధ్య నిర్వహణ, ఇంటింటికీ చెత్త సేకరణ ప్రక్రియ, రోడ్లు, కాల్వల అభివృద్ధి పనుల పురోగతిని సమీక్షి ంచారు.

**పనులలో నాణ్యతతోపాటు సమయపాలన...**

అనంతరం అధికారులతో జరిగిన సమావేశంలో కమిషనర్ మాట్లాడుతూ.. అభివృద్ధి పనుల అమలులో నాణ్యతతో పాటు సమయపాలనను ఖచ్చితంగా పాటించాలని ఆదేశించారు. ప్రజలకు ఎటు వంటి ఇబ్బందులు కలగకుండా పౌర సేవలు అం దించడమే అధికారుల ప్రథమ కర్తవ్యమని గుర్తు చేశారు.

**పన్నుల వసూళ్లపై ప్రత్యేక దృష్టి**

అలాగే, మున్సిపల్ ఆదాయాన్ని మెరుగుపరిచేదిశగా ఆస్తి పన్నుల వసూళ్లలో వేగం పెంచాలని, పెండింగ్‌లో ఉన్న పన్నులను త్వరితగతిన వసూలు చేయాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. ప్రజల నుంచి అందే ఫిర్యాదులపై తక్షణమే స్పం దించి పరిష్కరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ ఎన్. వసంత, సానిటేషన్ డి.ఇ సంతోష్, ఇంజనీరింగ్ డి.ఇ మాధవచారి, ఏఎంసీలు వెంకటేష్, శ్రవణ్, గంగన్న, మధుసూదన్‌రెడ్డి, నగేష్‌బాబు పాల్గొన్నారు. వీరితోపాటు యూబీడీ, యూసీడీ విభాగాల అధికారులు, ఏసీపీ శ్రీనివాస్, టాప్స్ స్రవంతి, ఇంజనీరింగ్ ఏఈలు, సర్కిల్ సిబ్బంది ఈ పర్యవేక్షణలో పాల్గొన్నారు.

## టైరు పేలి కారుపైకి దూసుకెళ్లిన వ్యాన్..

### ఒకరి మృతి, నలుగురికి గాయాలు

**కందుకూరు, ఏప్రిల్ 8, ప్రభాతవార్త:** మృత్యువు రూపంలో దూసుకొచ్చిన డీసీఎం వ్యాన్ ఒక నిండు ప్రాణాన్ని బలితీసుకోగా, మరో నలు గురిని ప్రాణాపాయ స్థితికి నెట్టింది. హైదరాబాద్ శ్రీశైలం జాతీ య రహదారిపై కందుకూరు మండల కేంద్ర సమీపంలోని నవార్ బాల్ రెడ్డి ఫంక్షన్ హాల్ వద్ద ఈ విషాద సంఘటన చోటు చేసుకుంది.

**ఐదు నిమిషాల్లో ఇల్లు చేరుతారనగా..**

పోలీసుల కథనం ప్రకారం.. కందుకూరు గ్రామానికి చెందిన సురసాని భరత్‌సింహారెడ్డి,చిన్నాన్న రవీందర్‌రెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి కారులో హైదరాబాద్ నుండి కందుకూరుకు వస్తున్నారు. మరో ఐదునిమిషాల్లో ఇంటికి చేరుకుంటారనగా, ఎదురుగా వస్తున్న కోళ్ల డీసీఎం వ్యాన్ ముందు టైరు ఒక్కసారిగా పేలిపోయింది. దీంతో అదుపుతప్పిన వ్యాన్ కుడివైపునకు దూసుకు వచ్చి భరత్‌సింహారెడ్డి నడుపుతున్న కారును బలంగా ఢీకొట్టింది. ప్రమాదంలో భరత్ సింహారెడ్డి (24) అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోగా, కారులో ఉన్న రవీందర్ రెడ్డి, స్వాతి, అవినాష్ రెడ్డి, అమ్ములు తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న కందుకూరు పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని, క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించారు. భరత్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించినట్లు సీఐ వెంకటేశ్వర్లు తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

**ఆ కుటుంబంలో ఇది రెండో ప్రమాదం..**

గతంలోనూ ఇదే కుటుంబంలో రోడ్డుప్రమాదం జరగడం, ఇప్పుడు చేతికందిన కుమారుడు మృతిచెందడంతో కందుకూరులో విషాద ఛాయలు అలముకున్నాయి. మృతుని తల్లిదండ్రుల రోదనలు స్థానికులను కంటతడి పెట్టించాయి.

## వృద్ధురాలి హత్య కేసులో నిందితుల అరెస్ట్

**పరిగి ఏప్రిల్ 8, ప్రభాతవార్త :** బంగారు నగల కోసం ఆశపడి వృద్ధిరాలి హ్యాతచేసి, సాక్ష్యాలు దొరకకుండా మృతదేహాన్ని కాల్చివేసిన సంఘటన కలకలం రేపింది.. వికారాబాద్ జిల్లా, కుల్కచర్ల మండల పరిధిలోని బండవెల్కచర్ల గ్రామానికి చెందిన కొత్త బాయి వెంకటమ్మ(63) వృద్ధురాలు ఏప్రిల్ 4వ తేదీన గురైంది. నిందితులను అరెస్ట్ చేసిన పోలీసులు, రిమాండ్‌కు పంపారు. పరిగి డిఎస్పి శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం, ఈ నెల 5వతేదీన గండీడ్ మండలం, పగిడ్యాల్ గ్రామానికి చెందిన బాపనిపల్లి లక్ష్మి ్మ తన తల్లి వెంకటమ్మ 4 వతేదీన కుల్కచర్ల బ్యాంకుకు వెళ్లి వస్తానని చెప్పి, సాయంత్రం అయిన బండవెల్కిచర్ల కు రాలేదని,ఫోన్లు కూడా కలవట్లేదని కుల్కచర్ల పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసింది.. పోలీసులు వివిధ కోణాల్లో విచారణ చేపట్టగా బండవెల్కిచెర్ల గ్రామానికి చెందిన చీపిరి మంజుల (35 సంవత్సరాలు), ఆమె భర్త భీరయ్య, వారి బంధువు కోడిగంటి అరుణ్ కుమార్ బీరప్ప కలిసి ముందస్తు పథకం ప్రకారం కొత్తబావి వెంకటమ్మను హత్య చేశారని తేలింది. మంజుల,ఆమె భర్త భీరయ్య లు బ్యాంకు కు వెళ్లిన వెంకటమ్మకు మద్యం తాగించి, తిర్మలాపూర్ పరిధిలో గల అడవి ప్రాంతానికి తీసుకెళ్లి చున్నితో గొంతు నులిమి హత్య చేశారని , ఆమె వద్ద ఉన్న బంగారు, వెండి ఆభరణాలు, సెల్‌ఫోన్లు దొంగిలించారని తెలిపారు. సాక్ష్యాలు దొరకకుండా, నిందితులు వెంకటమ్మ మృతదేహాన్ని అడవి ప్రాంతంలో రాళ్ల మధ్య వేసి పెట్రోల్‌పోసి కాల్చివేసినట్లు విచారణలో తేలిందని డిఎస్పి తెలిపారు. అనంతరం దొంగిలించిన నగలు, సెల్ ఫోన్లను కామునిపల్లి గ్రామంలో దాచారు.ఏప్రిల్ 8న నిందితురాలు చిపిరి మంజులను విచారిస్తే నేరాన్ని ఒప్పుకొందని, మంజుల ఇచ్చిన సమాచారం ఆధారంగా మిగతా నిందితు లను కూడా అదుపులోకి తీసుకున్నామని తెలిపారు. ముగ్గురు కలిసి ఈ నేరాన్ని చేసినట్లుగా ఒప్పుకున్నందున, న్యాయస్థానం ముందు హాజరు పరుస్తామని డిఎస్పి శ్రీనివాస్ పేర్కొన్నారు..మృతదేహం పూర్తిగా కుళ్లిపోయిన స్థితిలో ఉండగా, కొంత చీర ముక్కను తన తల్లిదే అని మృతురాలి కూతురు లక్ష్మి ్మ తెలపడంతో అదృశ్యమైన మహిళ వెంకటమ్మగా నిర్ధారించారు. కేసును వేగంగా ఛేదించిన కుల్కచర్ల ఎస్ఐ రమేష్‌కుమార్, సిబ్బందిని డిఎస్పి శ్రీనివాసులు, సిఐ శ్రీనివాస్‌రెడ్డి అభినందించారు. రైటర్ శంకరయ్య, సీసీటీఎన్ఎస్ రైటర్ రాఘవేందర్, పీసీలు భూపాల్ రెడ్డి, శివ, గోపాల్ మరియు మొగులయ్య హెచ్‌జీల సేవలను ప్రశంసించారు.నిందితులనుంచి బంగారునెక్లెసు, చెవిదుద్దులు,బంగారు గుండ్లు,కడియాలు,సెల్ఫోన్లను స్వాధినం చేసుకున్నారు.

### నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

**షాబాద్, ఏప్రిల్ 8, ప్రభాతవార్త:** తాళ్లపల్లి విద్యుత్ ఫీడర్‌లో సమస్యలను పరిష్కరించేందుకు చేపడుతున్న పనుల కారణంగా గురువారం షాబాద్ మండలంలోని తాళ్లపల్లి విద్యుత్ ఫీడర్ నుండి విద్యుత్ సరఫరా అవుతున్న తాళ్ళపల్లి, వెంకమ్మగూడ, తిమ్మారెడ్డిగూడ గ్రామాల్లో మంగళవారం విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ ఏఈ కోటేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ లైన్లకు చెట్ల కొమ్మలు అడ్డు వచ్చి సరఫరాకు అంతరాయం కలిగిస్తున్నందున వాటిని తొలగిస్తున్నందున ఉదయం 7 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్లో అంతరాయం ఏర్పడు తుందని వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

## కాంగ్రెస్‌తోనే పేదల ఇంటి కల సాకారం : సర్పంచ్

**మర్కుక్, ఏప్రిల్ 8(ప్రభాతవార్త):** పేదలకు ఇంటి కల సాకారం కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సాధ్యమవుతుందని సర్పంచ్ ర్యాకం యాదగిరి అన్నారు. మండల పరిధిలోని చేబర్తి గ్రామంలో గందమల్ల పద్మ మల్లేశంకు మంజూరైన ఇందిరమ్మ ఇల్లు నిర్మాణం పూర్తిచేసుకొని బుధవారం గృహ ప్రవేశం చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సర్పంచ్ ర్యాకం యాదగిరి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంతోనే గ్రామాల అభివృద్ధి జరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఇందిరమ్మ కమిటీ సభ్యులు అరవింద్, ఓంకార్, వార్డు సభ్యులు లింగని కనకయ్య, బొమ్మను శ్యాంసుందర్, ఆంజనేయులు, అనురాధ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## గృహప్రవేశంలో పాల్గొన్న పట్లోళ్ల చంద్రశేఖర్‌రెడ్డి



ఇందిరమ్మ ఇంటి గృహ ప్రవేశంలో పాల్గొన్న చంద్రశేఖర్‌రెడ్డి

**సిర్గాపూర్, ఏప్రిల్ 8, ప్రభాతవార్త:** మండల పరిధిలోని లక్ష్మణ్ నాయక్ తండాలో బుధవారం నిర్వహించిన ఇందిరమ్మ ఇంటి గృహ ప్రవేశంలో కాంగ్రెస్ నేత పట్లోళ్ల చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొని గృహస్థులకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ విఠల్‌నాయక్, కడపల్ మాజీ సర్పంచ్ యాదవరెడ్డి, విఠల్‌రావు, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు కృష్ణ, ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడె తుకారం పవార్, ఎస్సీ సెల్ యువజన నేత జయరాజ్, నాయకులు హనుమంత్, పరశురాం, తుకారాం పాటిల్, ఆకాష్ పాల్గొన్నారు.

## విద్యార్థులను వేధిస్తున్న పాఠశాలల గుర్తింపు రద్దు చేయాలి

### ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి జనార్ధన్

**సిద్దిపేట అర్బన్, ఏప్రిల్ 8, ప్రభాతవార్త :** జిల్లాలో ప్రైవేటు విద్యాసంస్థలు విద్యను వ్యాపారంగా మార్చేస్తూ విద్యార్థుల భవిష్యత్తుతో ఆడుకుంటున్నాయని ఏఐఎస్ఎఫ్ జిల్లాకార్యదర్శి జేరిపోతుల జనార్ధన్ అన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. విద్యా సంవత్సరం చివరి మాసం వార్షిక పరీక్షల్లో ప్రతిభను తెలుసుకోవడానికి సన్నద్ధం అవుతుంటే విద్యార్థులను ప్రోత్సహించాల్సిందిపోయి ఫీజులు చెల్లించ లేదన్న నెపంతో మానసిక వేదనకు కొన్ని ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలు గురిచేస్తున్నాయన్నారు. ప్రభుత్వ ఆదేశాలను పట్టించుకోకుండా అధిక ఫీజులు వసూలు చేస్తున్నారని మండిపడ్డారు. విద్యాహక్కు చట్టాలను తుంగలో తొక్కుతూ కేవలం ధనార్జనే ధ్యేయంగా సాగుతున్న ఈ ప్రైవేటు పాఠశాలల ఆగడాలను ఏఐఎస్ఎఫ్ తీవ్రంగా వ్యతిరేకిస్తుందన్నారు. ఫీజుల పేరుతో విద్యార్థుల వేధింపులను అడ్డుకోకపోతే భవిష్యత్‌లో విద్యావ్యవస్థ మరింత దిగజారి పోయే ప్రమాదం ఉందన్నారు. ఇప్పటికైనా విద్యాశాఖ అధికారులు స్పందించి విద్యార్థులను వేధిస్తున్న పాఠశాలల గుర్తింపును రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

## ఈత చెట్లను నరికివేసిన దుండగులు



మజీద్‌పల్లిలో ఈత చెట్లను నరికిన దృశ్యం

**వర్గల్, ఏప్రిల్ 8 (ప్రభాతవార్త):** మండల పరిధిలోని మజీద్‌పల్లి గ్రామంలో ఈతచెట్లను గుర్తుతెలియని దుండగులు నరికివేసిన ఘటన చోటుచేసుకుంది. మజీద్‌పల్లిలో సుమారు 150 ఈత చెట్లను గౌడ సంఘం ఆధ్వర్యంలో నాటి 15 నుండి 20 సంవత్సరాలు అవుతుండగా, ప్రస్తుతం గీతకు వచ్చిన చెట్లను నరికివేయడం జరిగింది. విషయం తెలుసుకున్న గౌడ సంఘం నాయకులు ఈఘటనకు పాల్పడిన దుండగులను శిక్షించాలని డిమాండ్‌చేస్తూ రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. ఈ విషయంపై గౌడ సంఘం నాయకులు బేగంపేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

## కేసరి హనుమాన్ దేవాలయంలో వార్షికోత్సవ వేడుకలు



ఆలయంలో శ్రీ లక్ష్మీనారాయణస్వామి కళ్యాణం జరిపిస్తున్న దృశ్యం

**గజ్వేల్, ఏప్రిల్ 8 (ప్రభాతవార్త):** పట్టణ శివారులోని కేసరి హనుమాన్ దేవాలయంలో వార్షికోత్సవ వేడుకలు అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. ఆలయ పరిసరాలు మంత్రోచ్ఛరణలతో మారుమోగుతుండగా, భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకోవడం జరిగింది. బుధవారం స్వయంభూ ఆంజనేయస్వామికి అష్టోత్తర శత కలశాభిషేకం నిర్వహించారు. అనంతరం లక్ష్మీనారాయణస్వామి కళ్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు నాయిని ప్రతాప్‌రెడ్డి, శ్రీనివాస్, జయసింహ, పిచ్చయ్యలతో పాటు హనుమాన్ దీక్షా స్వాములు, భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

## తుక్కుగూడ ఫ్యాబ్ సిటీలో డిజిపి పర్యటన

**రంగారెడ్డి అర్బన్, ఏప్రిల్ 8,ప్రభాతవార్త:** తుక్కుగూడ ఫ్యాబ్ సిటీలో బుధవారం డీజీపీ శివధర్‌రెడ్డి, ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనర్ జి.సుధీర్ బాబు కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా నిర్మాణంలో ఉన్న పోలీస్ కమిషనర్ కార్యాలయ భవనాన్ని పరిశీలించి, జరుగుతున్న పనుల పురోగతిని తెలుసుకున్నారు.అధికారులు భవనంలోని వివిధ భాగాలను సందర్శించి,అక్కడ జరుగుతున్న సివిల్ పనులు,విద్యుత్,తాగునీరు,డ్రైనేజ్ వంటి పనులను పరిశీలించారు.పనులు ఎలా జరుగుతున్నాయో చూసి,అవసరమైన మార్పులు చేయాలని సూచించారు.ఈ సందర్భంగా డీజీపీ మాట్లాడుతూ,కమిషనర్ కార్యాలయం అన్ని అవసరమైన సౌకర్యాలతో ఉండేలా నిర్మించాలన్నారు.పోలీస్ సిబ్బంది సౌకర్యంగా పని చేసేలా కార్యాలయం ఉండాలని, ప్రజలకు సేవలు సులభంగా అందేలా ఏర్పాట్లు చేయాలని చెప్పారు.ఇంకా మిగిలి ఉన్న పనులను త్వరగా పూర్తి చేయాలని, పనులు ఆలస్యం కాకుండా చూడాలని ఇంజనీర్లకు సూచించారు. పనుల నాణ్యతపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని,నిర్ణయించిన సమయానికి పనులు పూర్తి చేయాలని అన్నారు.అనంతరం, మీర్‌ఖాన్‌పేట్ ప్రాంతంలో ప్రభుత్వం కేటాయించిన స్థలాలను అధికారులు సందర్శించారు.అక్కడ భవిష్యత్తులో కమిషనర్ కార్యాలయం పనులు,నిర్మించాల్సిన శాశ్వత భవనాల మాస్టర్ ప్లాన్‌పై సంబంధిత అధికారులతో చర్చించారు.స్థలాలను పరిశీలించిన అధికారులు,భవనాల నిర్మాణానికి అవసరమైన విషయాలను చూసి,పనులు త్వరలోనే ప్రారంభించాలని సూచించారు.ఈ నిర్మాణాల వల్ల ప్రజలకు మెరుగైన పోలీస్ సేవలు అందుతాయని తెలిపారు.త్వరలోనే తుక్కుగూడ నుంచి పూర్తి స్థాయి పోలీస్ సేవలు అందుబాటులోకి వస్తాయని అధికారులు తెలిపారు. ఈ కొత్త కార్యాలయం ద్వారా సేవలు మరింత సులభంగా, వేగంగా అందుతాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో మహేశ్వరం డీసీపీ కె.నారాయణ రెడ్డి,ఇబ్రహీంపట్నం ఏసీపీ రాజు,ఏసీపీ అరుణ్ కుమార్ ఇతర అధికారులు పాల్గొన్నారు.



వార్షికోత్సవాలకు ముస్తాబైన సీమ హనుమాన్ ఆలయం దృశ్యం

## వార్షికోత్సవాలకు ముస్తాబైన ఆంజనేయ ఆలయం

**సిర్గాపూర్, ఏప్రిల్ 8, ప్రభాతవార్త:** మండల పరిధిలోని పంచముఖి గ్రామ శివారులోని సీమ ఆంజనేయస్వామి ఆలయం తృతీయ వార్షికోత్సవాలకు ముస్తాబైంది. ఈ నెల 9వ తేదీ నుంచి 16వ తేదీ వరకు అఖండ హరినామ సప్తహ భజనలు, కీర్తనలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ బాధ్యులు పేర్కొన్నారు. భక్తులకు అన్నదాన వితరణకు ఏర్పాటు చేశామని తెలిపారు. 9న ఉదయం 10.30 గంటలకు సప్త కార్యక్రమాన్ని శ్రీకరణ్ గజేంద్రద భారతి మహారాజ్ ప్రారంభిస్తారని వివరించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామి వారిని దర్శించుకుని పునీతులు కావాలని ఆలయ కమిటీ బాధ్యులు కోరారు.

## ఉపాధి హామీ పనులు ప్రారంభం



ఉపాదిహామీ పనులను ప్రారంభిస్తున్న సర్పంచ్ కున్యనాయక్

**చిలిపిచెడ్, ఏప్రిల్ 8 ప్రభాతవార్త :** కేంద్ర ప్రభుత్వం గ్రామీణ ప్రాంత ప్రజలకు స్వయం ఉపాధి కల్పించడానికి ఉపాధి హామీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో ప్రారంభించింది. ఈ పథకంతో గ్రామంలోని ప్రజలకు ఉపాధి కల్పిస్తూ కనీస వేతనం అందిస్తూ జీవనోపాధి కల్పించింది. మెదక్ జిల్లా చిలిపిచెడ్ మండలంలోని బద్రియా తండా గ్రామంలో గ్రామ సర్పంచ్ రామవత్ కున్య ఉపాధి హామీ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరు ఉపాధి పనులకు హాజరవ్వాలన్నారు. ఉపాధి పని దినాలను వినియోగించుకుంటూ అధిక వేతనాలు పొందాలన్నారు. ప్రస్తుతం తండా శివారులోని పూడికతీత పనులు జరుగుతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పచ్ కున్య నాయక్, ఉపసర్పంచ్ మోనికగణేష్ ,ఈ సి భగవన్ రెడ్డి, టి ఏ సురేష్, ఉపాధి హామీ కూలీలు తదితరులు పాల్గొన్నారు.

### విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలి : తహసీల్దార్

**చిన్నశంకరంపేట, ఏప్రిల్ 8, ప్రభాతవార్త:** ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడం ఉపాధ్యాయుల బాధ్యతని తహసీల్దార్ మాలతి అన్నారు. బుధవారం చిన్నశంకరంపేట మండల పరిధిలోని జంగరాయి, ఎర్రగుంట తండాలోని ప్రాథమిక పాఠశాలను సందర్శించి రికార్డులను తనిఖీ చేశారు. మెనూప్రకారం విద్యార్థులకు భోజనాన్ని అందించాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రంలోని చిన్నారులతో ముచ్చటించారు. అనంతరం రేషన్ దుకాణాన్ని తనిఖీ చేశారు. ప్రభుత్వం మూడు నెలల రేషన్ బియ్యాన్ని ఒకేసారి పంపిణీ చేస్తుందని, గ్రామస్తులకు ఇబ్బందులు తలెత్తకుండా డీలర్లు తగు చర్యలు తీసుకోవాలన్నారు.

### ప్రజల సహకారంతో గ్రామాభివృద్ధికి కృషి : సర్పంచ్



పిచ్చి మొక్కలను తొలగిస్తున్న సర్పంచ్ మోహన్ నాయక్

**చిన్నశంకరంపేట, ఏప్రిల్ 8, ప్రభాతవార్త:** ప్రజల సహకారంతో గ్రామాన్ని అభివృద్ధి చేయడానికి కృషి చేస్తానని కామారం తండా సర్పంచ్ మోహన్‌నాయక్ అన్నారు. బుధవారం కామారం తండా పంచాయతీ పరిధి రాజ్యాతండాలోని ప్రధాన రహదారి, ప్రాథమిక పాఠశాలలోని పిచ్చి మొక్కలను తొలగించారు.

## 'బడిబాట' కరపత్రం ఆవిష్కరణ



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న సర్పంచ్ నవ్యనాగరాజుగౌడ్,ఉపాధ్యాయులు

**మనోహరాబాద్, ఏప్రిల్ 8 ప్రభాతవార్త :** కాళ్లకల్ ఉన్నత పాఠశాలను బలోపేతం చేయడంలో ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమ కరపత్రాన్ని సర్పంచ్ మద్దూరి నవ్యనాగరాజ్‌గౌడ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య, అర్హత కలిగిన ఉపాధ్యాయులు, శాస్త్రీయ విద్య లభిస్తుందన్నిరు. అలాగే అల్పాహారం, మధ్యాహ్నం భోజనం లభిస్తుందని తెలిపారు. ప్రధానోపాధ్యాయులు హరికృష్ణ మాట్లాడుతూ పాఠశాలలో సైన్స్‌ల్యాబ్, భవిత సెంటర్, విజ్ఞాన విహారయాత్ర ఉంటుందన్నారు. తల్లితండ్రులు పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించి ప్రత్యేక నమోదులో విద్యార్థిని విద్యార్థులను అధిక సంఖ్యలో నమోదు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ఛైర్మన్ ఖైరున్నిసా వార్డ్ మెంబర్లు మనిషామల్లేష్, నవీన సత్యనారాయణ, కనిగిరి అనసూయకృష్ణ, ఇర్ఫాన్,ఆరిఫ్, కవిత శ్రీశైలం కొమ్ము సురేష్ ఉపాధ్యాయులు నరసింగం, స్టెల్లా, ఉమాదేవి, నాగిరెడ్డి, మాలతి పాల్గొన్నారు.

### అమ్మవార్ల జాతర ఉత్సవాలు ప్రారంభం

**నర్సాపూర్, ఏప్రిల్ 8, ప్రభాతవార్త :** మండల పరిధిలోని తుజాల్పూర్ గ్రామంలో గ్రామస్తుల ఆధ్వర్యంలో శ్రీ ముత్యాలమ్మ నల్ల పోచమ్మ జాతర ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈసందర్బంగా మొదటి రోజున గంగకు వెళ్లడం అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఒగ్గు కళాకారులు తమ విన్యాసాలతో శివసత్తుల తో ఊగుతూ గంగకు వెళ్లడం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ జాతర ఉత్సవాల భాగంగా మిగతా రెండు రోజుల్లో శ్రీ ముత్యాలమ్మ కు నల్ల పోచమ్మ అమ్మవార్లకు బోనాలు తీయట ప్రత్యేక పూజలు అగ్నిగుండాలు వంటి తదితర కార్యక్రమాలు ఉంటాయని జాతర ఉత్సవ నిర్వాహకులు తెలిపారు.



అమ్మవార్ల జాతరలో

# సమస్యలు పరిష్కరించాలంటూ విద్యుత్ ఉద్యోగుల సమ్మె



ధర్నా చేస్తున్న విద్యుత్ ఆర్టిసన్ సిబ్బంది

**నారాయణఖేడ్, ఏప్రిల్ 8 ప్రభాతవార్త:** విద్యుత్ రంగంలో పనిచేస్తున్న అసిస్టెంట్ ఇంజనీర్లు, జూనియర్ లైన్‌మెన్‌లు, ఇతర సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి తెలంగాణ విద్యుత్ ఆర్టిసన్ ఉద్యోగుల జాయింట్ యాక్షన్ కమిటీ (టీవీఏఈజేఏసీ) ఆధ్వర్యంలో సమ్మె సైరన్ మోగించారు. విద్యుత్ శాఖలో పనిచేస్తున్న ఉద్యోగుల పలు సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ముఖ్యంగా విద్యుత్ ఆర్టిసన్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించడంతోపాటు, పాత ఏపీఎస్ఈబీ సర్వీస్ రూల్స్ ను పునరుద్ధరించాలని, సర్వీస్‌రూల్స్ అమలుచేయాలని సంఘం కోరుతోంది. అదేవిధంగా తెలంగాణలోని టీజీఎన్‌పీడీసీఎల్, టీజీఎస్‌పీడీసీఎల్‌లలో సంస్థల్లో పనిచేస్తున్న వర్కర్లను ఆర్టీజన్లుగా విలీనం చేసుకోవాలని కోరుతున్నారు. 2016 డిసెంబర్ 4వ తేదీ తర్వాత ఉద్యోగాల్లో చేరినవారికి సర్వీస్ ప్రయోజనాలు కల్పించాలని, పీస్ రేట్ కార్మికులకు జీఓ నం.11 ప్రకారం న్యాయం చేయాలని వారు కోరుతున్నారు. ఇప్పటికే తమ సమస్యలపై పలుమార్లు అధికారులకు వినతిపత్రాలు ఇచ్చినా సరైన స్పందన లభించలేదని ఉద్యోగ సంఘం నాయకులు పేర్కొన్నారు. అందుకే రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న విద్యుత్ ఉద్యోగులు పెద్ద సంఖ్యలో సమ్మెను పూనుకోవడం జరుగుతుందని తెలిపారు. టీవీఏఈ జాక్ టీజీఎస్‌పీడీసీఎల్ కంపెనీ చైర్మన్ వెంకట్ నాయక్, డివిజన్ చైర్మన్ రంజిత్, జిల్లా కన్వీనర్ దుర్గానాయక్, ఉమ్మడి మెదక్ జిల్లా ఆర్గనైజేషన్ సెక్రటరీ రాజు, జోగిపేట్ డివిజన్ కన్వీనర్ పవన్ అంబదాస్, నారాయణఖేడ్ సబ్ డివిజన్ చైర్మన్ సాయిలు, కన్వీనర్ ప్రవీణ్ కుమార్, కో కన్వీనర్ మల్లేష్, కోచెర్మన్ రమేష్, శ్రీకాంత్, స్పాట్ బిల్లర్ పవన్, నర్సింలు, ముఖేష్, శ్రీనివాస్ అందరూ స్వచ్ఛందంగా సమ్మెలో పాల్గొన్నారు.

## విద్యార్థుల సంక్షేమంలో రాజీలేదు

**-రీజినల్ కోఆర్డినేటర్ గంగారాంనాయక్**

**కౌడిపల్లి, ఏప్రిల్ 8, ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని 765డి జాతీయ రహదారిపై గిరిజన సంక్షేమపాఠశాల విద్యార్థులు ఎవరో స్వార్థపరుల ప్రలోభాలకు తలొగ్గి తరుచూ గురుకులంపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నట్లు రీజినల్ లెవల్ కమిటీతో తనిఖీ చేయగా విషయం తెలిసిందని రీజినల్ కో ఆర్డినేటర్ గంగారామ్‌నాయక్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయన మాట్లాడుతూ రీజినల్ లేవల్ కమిటీ సభ్యులు విద్యార్థులందరితో మాట్లాడం జరుగా నిధులు దుర్వినియోగం జరిగినట్లుగా వస్తున్న ఆరోపణలు పూర్తిగా అవాస్తవమన్నారు. ముఖ్యంగా విద్యార్థులలో క్రమ శిక్షణ లోపించిన విషయాన్ని గుర్తించినట్లు ఆయన తెలిపారు. అట్టివారికి తగిన రీతిలో తగతులు బోధించి, కౌన్సిలింగ్ నిర్వహించి విద్యార్థులను గాడిలో పెట్టే ప్రక్రియ ప్రారంభించనట్లు ఆయన అన్నారు. గత కొన్ని రోజులుగా వివిధ మీడియాలో కథనాలు వచ్చే విధంగా వ్యవహరించిన విషయంపై పూర్తి స్థాయి విచారణ జరిపి చర్యలకు ఉన్నతాధికారులకు సిఫార్సు చేస్తామన్నారు. ఇకనుంచి పాఠశాలలో ప్రిన్సిపాల్ అనుమతి లేకుండా ఏవరు ప్రవేశించడం నిషేదించమని ఆయన అన్నారు. అలా వచ్చినవారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. సేవాలాల్ జయంతి నిధులు దుర్వినియోగం చేశారని వచ్చిన ఆరోపణలు సరికావని ఆయన అన్నారు. ఈ విచారణ కమిటీలో సినియర్ ప్రిన్సిపాల్ సుమతి, అమర్ సింగ్, లలిత దేవి, విద్యార్థులు తదితరలు పాల్గొన్నారు.

ఐలాపూర్ భూముల్లో అడుగుపెట్టే హక్కు

## హైడ్రాకు లేదు: న్యాయవాది ముఖీమ్



మాట్లాడుతున్న న్యాయవాది ముఖీమ్, మంద కృష్ణ మాదిగ

**అమీన్‌పూర్ ఏప్రిల్ 8 (ప్రభాతవార్త):** ఐలాపూర్ భూముల్లో హైడ్రా అధికారులు ప్రవేశించే హక్కు లేదని న్యాయవాది ముఖీమ్ స్పష్టం చేశారు. బడుగు, బలహీన వర్గాల భూములపై కన్నేసిన ప్రభుత్వం హైడ్రా పేరుతో దోపిడీకి పాల్పడుతోందని ఆయన ఆరోపించారు. ఈ విషయంపై అమీన్‌పూర్‌లో నిర్వహించిన పాత్రికేయ సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో ఎంఆర్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ పాల్గొన్నారు. ఈ సందర్భంగా న్యాయవాది ముఖీమ్ మాట్లాడుతూ ఐలాపూర్ భూముల విషయంలో తమకు అనుకూలంగా కోర్టు డిక్రీ ఉందని తెలిపారు. రిట్ అప్పీల్ పెండింగ్‌లో ఉన్న నేపథ్యంలో రెవెన్యూ అధికారులు, హైడ్రా అధికారులు ఆ భూముల్లోకి ప్రవేశించకూడదని స్పష్టమైన ఆదేశాలు ఉన్నాయని చెప్పారు. అయినప్పటికీ హైడ్రా అధికారులు వాహనాలతో గ్రామంలో తిరుగుతూ రైతులను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. అమీన్పూర్ రెవెన్యూ అధికారులు డ్రోన్లద్వారా ఐలాపూర్ భూములపై నిఘా పెట్టడం ఖండనీయమని అన్నారు. సంవత్సరం క్రితం ఐలాపూర్ రాజగోపాల్ నగర్ పేరుతో ఏర్పడిన కొత్త సొసైటీ, హైడ్రా అధికారి రంగనాథ్‌తో కలిసి భారీ భూకుంభకోణానికి పాల్పడుతున్నట్లు తమకు సమాచారం ఉందని, త్వరలో ఆ విషయాలను బయటపెడతామని తెలిపారు. ఈ సందర్భంగా మంద కృష్ణమాదిగ మాట్లాడుతూ ఐలాపూర్ భూముల వ్యవహారంలో హైడ్రా, రెవెన్యూ అధికారులు నిబంధనలకు అనుగుణంగా సంయమనంతో వ్యవహరించాలని సూచించారు. కేసు తుది తీర్పు వచ్చే వరకు రైతులను ఇబ్బంది పెట్టకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి విజ్ఞప్తి చేశారు. వివాదాస్పదం కాని భూముల విషయంలో హైడ్రా, రెవెన్యూ, రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకోకూడదని ఎమ్మార్పీఎస్ తరఫున సూచించారు. రైతుల చట్టబద్ధ హక్కులను హైడ్రా కాలరాయవద్దని, ఆ భూముల్లో వ్యవసాయం మరియు నిర్మాణాలు చేసుకునే హక్కు రైతులకు ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఐలాపూర్ రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

### ఇందిరమ్మ ఇంటిని ప్రారంభించిన రాజిరెడ్డి

**హత్నూర, ఏప్రిల్ 8, ప్రభాతవార్త :** ఇందిరమ్మ పథకంతో పేదింటి కల నెరవేరుతుందని కాంగ్రెస్ పార్టీ నర్సాపూర్ నియోజకవర్గ ఇంచార్జ్ ఆవుల రాజిరెడ్డి అన్నారు బుధవారం హత్నూర మండలం నవపేట గ్రామంలో ఇందిరమ్మ పథకం ద్వారా నిర్మించిన నూతన ఇంటిని ఆయన పార్టీ నాయకులతో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ ఎరకల బుచ్చయ్య, కాంగ్రెస్ పార్టీ నాయకులు కర్రే కృష్ణ కొన్యాల వెంకటేశం, వెంకటాపురం మల్లేశం, బుచ్చిరెడ్డి, శ్రీనివాసరెడ్డి, దానంపల్లి సత్యం,చార్ల మణిదీప్ గోపాల్, జిన్నారం వెంకటేశం, ఆసిఫ్, అబ్దుల్లా, తదితరులు పాల్గొన్నారు



బోనాల కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు గ్రామస్తులు

## ఘనంగా గ్రామ దేవతలకు బోనాలు

**కొల్చారం, ఏప్రిల్ 8 ప్రభాతవార్త :** పెద్దమ్మ తల్లి తృతీయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని మండలపరిధిలోని వరిగుంతం గ్రామంలో బుధవారం గ్రామ దేవతలు పోచమ్మ, దుర్గమ్మలకు భక్తిశ్రద్ధలతో బోనాలు సమర్పించారు. ఈ సందర్భంగా గ్రామ మహిళలు సంప్రదాయబద్ధంగా అలంకరించిన బోనాలతో గ్రామ వీధుల గుండా ఊరేగింపుగా వెళ్లి అమ్మవార్లకు సమర్పించారు. పోతరాజుల విన్యాసాలు, శివసత్తుల శివాలు, డబ్బు చప్పులతో గ్రామమంతా ఉత్సాహభరితంగా మారింది. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు.

### వాసవీ క్లబ్ నేతకు సత్కారం



సూర్యప్రకాష్‌రావును సత్కరిస్తున్న క్లబ్ నాయకులు

**సిద్దిపేట అర్బన్, ఏప్రిల్ 8, ప్రభాతవార్త :** వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ అధ్యక్షుడు సిద్ద సూర్యప్రకాష్‌రావు ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య మహాసభ కోశాధికారిగా నియామకమయ్యారు. ఈ మేరకు వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ హైదరాబాద్ కార్యాలయంలో సిద్దిపేటకు చెందిన వాసవిక్లబ్ నాయకులు బుధవారం శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో వాసవిక్లబ్ ఇంటర్నేషనల్ ఉపాధ్యక్షులు గంప శ్రీనివాస్, రీజన్ చైర్మన్ చింత రాజేంద్రప్రసాద్,ఇంటర్నేషనల్ ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ గంప కృష్ణమూర్తి, రీజియన్ కార్యదర్శి అర్వపల్లి హరి కిరణ్, నాయకులు పోశెట్టి శ్రీకాంత్, పోకల రాజేశం, చకిలం రవి,సముద్రాల కృష్ణమూర్తి, చామర్తి శ్రీనివాస్, కొత్త వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

### అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ సమస్యను పరిష్కరించిన సర్పంచ్

**కొమురవెల్లి, ఏప్రిల్ 8, ప్రభాతవార్త :** కొమురవెల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని దేవస్థానం వద్ద కొన్ని రోజులుగా కొనసాగుతున్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ సమస్యను గ్రామస్తులు సర్పంచ్ గొల్లపల్లి పద్మ ఆంజనేయులు దృష్టికి తీసుకెళ్లారు. సమస్యపై వెంటనే స్పందించిన సర్పంచ్ తక్షణ చర్యలు చేపట్టి సమస్యను పరిష్కరించారు. దీంతో దేవాలయం పరిసర ప్రాంతంలో నెలకొన్న అసౌకర్యాలు తొలగి గ్రామస్తులకు ఉపశమనం కలిగింది. సమస్యను త్వరగా పరిష్కరించిన సర్పంచ్‌కు గ్రామస్తులు కృత జ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ పోతుగంటి శ్రీనివాస్, వార్డు సభ్యులు గొల్లపల్లి రాజమణి నాగరాజు, ఎక్కలదేవి మహేష్, గ్రామ ప్రజలు, పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

**చిలిపిచెడ్, ఏప్రిల్ 8 ప్రభాతవార్త :**

మండల పరిధిలోని గుజీరితండా గ్రామంలో బుధవారం మల్లారెడ్డి సురారం ఆస్పత్రి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన వచ్చిందని సోహిని వీరభద్రశర్మ అన్నారు. బుధవారం సర్పంచ్ సుజాత మంజనాయక్‌తో కలసి వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వైద్య శిబిరానికి వచ్చిన రోగులకు బీపీ, షుగర్, రక్త పరీక్ష నిర్వ హించి, అవరమైన రోగులకు మందులు పంపిణీ చేశామన్నారు. అత్యవసర చికిత్స అవరమున్న వారికి రవాణా సౌకర్యం కల్పించడంతో పాటు, అన్ని రకాల పరీక్షలు నిర్వహించి, చికిత్స అందిస్తామన్నారు. కార్యక్రమంలో సోహిని వీరభద్ర శర్మ పావని తదితరులు ఉన్నారు.

## గర్భిణీలు, బాలింతల ఆరోగ్యంపై అవగాహన



గర్భిణీలు, బాలింతలు, కిశోర బాలికలతో నాయకులు

**గుమ్మడిదల ఏప్రిల్ 8 ప్రభాతవార్త :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 99 రోజుల ప్రజా పాలన కార్యక్రమంలో భాగంగా గుమ్మడిదల మున్సిపాలిటీలో గ్రామ ఆరోగ్యం, పోషకాహారంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణీలు, బాలింతలు, కిశోర బాలికల ఆరోగ్యంపై ప్రభావం చూపే అంశాలపై అధికారులు వివరించారు. ఆహారంలోఉన్న లోపాలను సరిదిద్దుకోవడం, వ్యక్తిగత పరిశుభ్రతతోపాటు పరిసరాల పరిశుభ్రతను పాటించాల్సిన అవసరాన్ని తెలియజేశారు. అలాగే ఆసుపత్రిలో కాన్పులు చేయించుకోవడం వల్ల తల్లి, శిశువు ఆరోగ్యంగా ఉండే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని తెలిపారు. ప్రైవేట్ ఆసుపత్రుల్లో అవసరం లేకపోయినా ఆపరేషన్‌లు చేసే పరిస్థితులు ఉండటంతో మహిళలు ఆరోగ్య సమస్యలు ఎదుర్కొనడమే కాకుండా ఆర్థిక భారం పడుతుందని సూచించారు.ప్రభుత్వ ఆసుపత్రుల్లో జరుగుతున్న కాన్పుల్లో తల్లి, బిడ్డ ఇద్దరూ క్షేమంగా ఉన్నారని, దీనివల్ల శిశు మరణాల రేటు, మాతృ మరణాల రేటు గణనీయంగా తగ్గిందని తెలిపారు. గుమ్మడిదల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రతి గర్భిణీ స్త్రీ ఆరోగ్య పరీక్షలు చేయించుకొని అక్కడే కాన్పులు చేయించుకోవాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణీలు, బాలింతలకు భోజనం అందించడంతో పాటు శిశువులకు బాలామృతం అందిస్తున్నామని తెలిపారు. పోషకాహార లోపంతో బాధపడుతున్న పిల్లలకు ప్రతి నెల డాక్టర్ల పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు, పోషకాహార సూచనలు అందిస్తున్నారని చెప్పారు. తీవ్రమైన పోషకాహార లోపం ఉన్న శిశువులకు సంగారెడ్డిలోని ఎన్ఆర్సీ కేంద్రంలో వైద్యుల పర్యవేక్షణలో చికిత్స అందిస్తున్నట్లు తెలిపారు.టీహబ్ ద్వారా రక్త పరీక్షలు నిర్వహించి వాటి నివేదికలను నేరుగా వారి ఫోన్లకు పంపిస్తూ సరైన వైద్య సేవలు అందిస్తున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ చిన్నపాపని కుమార్‌గౌడ్, కత్తుల రమేష్, చూర్ణం చక్రపాణి, ఆకుల సత్యనారాయణ పాల్గొన్నారు.అన్నారం కార్యక్రమంలో కౌన్సిలర్లు మురళి, కిషన్ పాల్గొన్నారు. ఎంపిహెచ్‌ఓ శ్రీనివాస్, సూపర్వైజర్ శ్రీలక్ష్మి, భాగ్యలక్ష్మి, కళ్యాణి, సభా ఆఫ్రీన్, ఏఎన్ఎంలు స్వరూప, శశికళ, వసంత, వసుంధర, హెల్త్ అసిస్టెంట్ సుబ్రహ్మణ్యం, ఆశా కార్యకర్తలు, అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు.



పాఠశాల భవన నిర్మాణ పనులు పరిశీలిస్తున కుమార్‌గౌడ్ తదితరులు

పాఠశాల భవన నిర్మాణంలో

### నాణ్యతకు ప్రాధాన్యతనివ్వాలి: మున్సిపల్ చైర్మన్

**గుమ్మడిదల, ఏప్రిల్ 8(ప్రభాతవార్త):** కస్తూర్బా పాఠశాల భవన నిర్మాణ పనులను బుధవారం మున్సిపల్ చైర్మన్ చిన్నపాపని కుమార్‌గౌడ్ పరిశీలించారు. నిర్మాణపనుల పురోగతిని క్షేత్రస్థాయిలో పరిశీలించిన ఆయన, పనులను వేగవంతంచేసి నాణ్యతతో పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు.పాఠశాల భవనం నిర్మాణం సమయానికి పూర్తైతే విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం, అవసరమైన సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని ఆయన పేర్కొన్నారు. భవన నిర్మాణంలో నాణ్యతకు ప్రాధాన్యం ఇవ్వడంతో పాటు అవసరమైన మౌలిక వసతుల ఏర్పాటుపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అధికారులకు ఆదేశించారు. అలాగే పనులు ఆలస్యం కాకుండా నిరంతరం పర్యవేక్షణ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఈఈ రాజు, నాయకులు సత్యనారాయణ, శేఖర్ రెడ్డి, సంబంధిత అధికారులు మరియు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

### సైదాపూర్‌లో విద్యుత్ సమస్యలు పరిష్కరించాలి



అధికారులకు వినతి పత్రం అందిస్తున్న సర్పంచ్

**కొండాపూర్ ఏప్రిల్ 8 ప్రభాతవార్త :** మండల పరిధిలోని సైదాపూర్ గ్రామంలో నెలకొన్న విద్యుత్ సమస్యలను త్వరగా పరిష్కరించాలని బుధవారం సర్పంచ్ రాధికరామాగౌడ్ జిల్లా ట్రాన్స్‌కో సూపరింటెండెంట్ ఇంజనీర్ సుధీర్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యుత్ సమస్య కారణంగా ప్రజలు, రైతులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. మారేపల్లి ఫీడర్ నుండి సైదాపూర్ వరకు 11 కేవీ విద్యుత్ లైన్ ఏర్పాటు చేసి అవసరమైన విద్యుత్ స్థంబాలను ఏర్పాటు చేయాలని కోరారు. అలాగే గ్రామంలో సుమారు 25 విద్యుత్ స్థంబాలను ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరించాలని వినతిపత్రంలో పేర్కొన్నారు.ఇక గ్రామంలో లో వోల్టేజ్ సమస్య కారణంగా ట్రాన్స్‌ఫార్మర్లు తరచూ దెబ్బతింటున్నాయని, అందువల్ల కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలని కూడా కోరారు. ఈ సమస్యలపై ట్రాన్స్‌కో ఎస్ఈ స్పందిస్తూ సంబంధిత డివిజన్ అధికారులకు సూచనలు ఇచ్చారు. డివిజన్ అధికారి నెహ్రూ నాయక్‌కు సమస్యను వివరించి త్వరితగతిన పరిష్కారం చూపేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ఈ సందర్భంగా అధికారులు సమస్యను త్వరలోనే పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

### చిన్నశంకరంపేటలో చలివేంద్రం ప్రారంభం

**చిన్నశంకరంపేట, ఏప్రిల్ 8,ప్రభాతవార్త:** ప్రజల దాహార్తిని తీర్చడానికి చలివేంద్రాలు ఉపయోగపడతాయని చిన్నశంకరంపేట పట్టణ సర్పంచ్ చంద్రశేఖర్ తెలిపారు. బుధవారం పట్టణ కేంద్రంలో చలివేంద్రాన్ని పాలకవర్గం సభ్యులతో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో ఈవో ప్రదీప్, ఉపసర్పంచ్ భాను ప్రసాద్, ఆలూరి రవి, గోపాల్ పాల్గొన్నారు.

### ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉచిత కంటి పరీక్ష శిబిరం

**నర్సాపూర్ ఏప్రిల్ 8, ప్రభాతవార్త :** నర్సాపూర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ డా. కె. హుస్సేన్ మార్గదర్శకత్వంలో కళాశాల ఇంచార్జి ప్రిన్సిపాల్ సమీరానజ్మీన్ ఆధ్వర్యంలో బుధవారం జాతీయ సేవా పథకం, జంతుశాస్త్ర విభాగం సంయుక్తంగా విద్యార్థులకు, సిబ్బందికి ఉచిత కంటి వైద్యశిబిరాన్ని నిర్వహించారు. శిబిరంలో ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి కంటి వైద్య నిపుణులు డా. రవళి, ఆఫ్తాల్మిక్ అధికారి రాజులు విద్యార్థులకు కంటి ఆరోగ్యంపై అవగాహన కల్పిస్తూ కంటి చూపులో కలిగే లోపాలు, వాటి కారణాలు, నివారణ మార్గాల గురించి వివరించారు. ఈ కార్యక్రమాన్ని ఎన్.ఎస్.ఎస్. ప్రోగ్రామ్ ఆఫీసర్ డా. బి. సురేష్ కుమార్ సమన్వయం చేశారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు మహేందర్ రెడ్డి, రాజు, ఎన్.ఎస్.ఎస్. వాలంటీర్లు కళ్యాణ్, కార్తీక్, శ్రీకాంత్, పూజిత మరియు అనేక మంది విద్యార్థులు పాల్గొన్నారు.

## యువ నాయకుడు ప్రవీణ్ మృతి

**కొల్చారం, ఏప్రిల్ 8 ప్రభాతవార్త :** మండల కేంద్రానికి చెందిన యువ నాయకుడు ముత్యం ప్రవీణ్ ఇటీవల ప్రమాదానికి గురై చికిత్స పొందుతూ నిన్న రాత్రి హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో మృతి చెందారు. ఆయన మృతివార్త తెలుసుకున్న కొల్చారం మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నాగుల గారి మల్లేశం గౌడ్ సమాచారం మేరకు కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ రాజిరెడ్డి హుటాహుటిన కొల్చారం చేరుకొని ముత్యం ప్రవీణ్ స్వగృహానికి వెళ్లి పూలమాల వేసి ఘనంగా శ్రద్ధాంజలి ఘటించారు.ఈ సందర్భంగా రాజిరెడ్డి మాట్లాడుతూ గతంలో నర్సాపూర్ తాలూకా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడిగా సేవలందించిన ముత్యం ప్రవీణ్ మంచి నాయకుడని, ఆయన మృతి కాంగ్రెస్ పార్టీకి తీరని లోటని అన్నారు. మంచితనానికి మారుపేరైన ప్రవీణ్ ఇక లేరన్న విషయం కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు జీర్ణించుకోలేకపోతున్నారని పేర్కొన్నారు. ప్రవీణ్ కుటుంబ సభ్యులకు కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో కొల్చారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నాగుల గారి మల్లేశం గౌడ్, కొల్చారం సర్పంచ్ దేవన్న గారి శేఖర్, చిన్న గణపురం సర్పంచ్ మధుసూదన్ రెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి గంగసాని మహేశ్వర్ రెడ్డి, మండల మైనార్టీ సెల్ అధ్యక్షుడు సయ్యద్ అక్రం, మాజీ సర్పంచ్ ఆశన్న గారి శ్రీశైలం, వార్డు సభ్యుడు బాలరాజ్, నాయకులు యాదగిరి, శేషులు, అశోక్, జీవన్ తదితరులు, ప్రవీణ్ అభిమానులు మరియు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## అంత్యక్రియలో పాల్గొన్న ఎమ్మెల్యే...

**కొల్చారం, ఏప్రిల్ 8(ప్రభాతవార్త):** మండల కేంద్రానికి చెందిన ముత్యం ప్రవీణ్ అంత్యక్రియల్లో నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించిన ఆమె, కుటుంబ సభ్యులను పరామర్శించారు. ప్రవీణ్ మృతి గ్రామానికి తీరని లోటని ఎమ్మెల్యే అన్నారు. అంత్యక్రియలకు పార్టీలకతీతంగా నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు గ్రామస్థులు పెద్దఎత్తున హాజరై ప్రవీణ్‌కు ఘనంగా నివాళులర్పించారు.





అంత్యక్రియలో పాల్గొన్న ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి తదితరులు